# మనం

## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

శుక్రవారం - 14 - ఆగస్టు - 2026 : పేజీలు 12


## విచారణ ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్



**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 13 మనంన్యూస్ :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై నిర్వహిస్తున్న విచారణ (హియరింగ్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని

మిగతా 2లో

## అవినీతికి కేరాఫ్...

# కణేకల్ తహసీల్దార్ కార్యాలయం



- ఏళ్ల తరబడి ఒకే మండలం ల విధులు.. వీఆర్వోపై అనేక ఆరోపణలు
- భూ వివాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తున్నారనే విమర్శలు
- సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు
- ఇరువైపుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారంటూ బాధితుల ఆవేదన
- వివాదాస్పద భూముల వ్యవహారంలో వీఆర్వో పాత్రపై అనుమానాలు
- అమాయకులకు వివాదాస్పద భూమి కట్టబెట్టారంటూ ఆరోపణలు
- ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితుడు
- లక్షల రూపాయలు తీసుకున్నా సమస్య పరిష్కారం కాలేదంటున్న మరో రైతు రైతు
- కణేకల్ బాధితుడిని రోజూ కార్యాలయం చుట్టూ తిప్పారనే ఆరోపణ
- ప్రశ్నించిన బాధితుడి పై చెప్పుతో కొడతా అంటూ బెదిరించారంటూ ఫిర్యాదు
- ఎమ్మెల్యే నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదులు..ఫలితం లేదంటున్న బాధితుడు
- కలెక్టర్ ఆదేశాల భేఖాతార్... బాధితుడి ఆవేదన
- విఆర్వోకు స్థానిక అధికారుల అండదండలు ఉన్నాయంటున్న బాధితులు
- తహసీల్దార్ కార్యాలయంలో వ్యవహార శైలిపై విమర్శలు
- జర్నలిస్టు ప్రశ్నలకు ఘాటుగా స్పందించిన వీఆర్వో?
- వీఆర్వోపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారుల మౌనం ఎందుకు?
- క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని బాధితుల డిమాండ్
- బాధితులను విడివిడిగా విచారిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్న స్థానికులు
- డబ్బుల లావాదేవీలపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఆరోపణలు నిజమా.. అపోహలా? ఉన్నతస్థాయి విచారణతోనే తేలాలి
- ఎదురుచూస్తున్న బాధిత రైతులు

మిగతా 2లో



## వామ్మో ఏవో... జడ్పీ పిఆర్‌లో మాస్ కలెక్షన్...!




- ప్రతి ఎంబుక్ రికార్డింగ్ కి చేయి తడపాల్సిందే
- ఉదయం సాయంత్రం మూడు గంటలే డ్యూటీ?
- వర్క్ బిల్లు చెల్లింపుకు నేరుగా ఫోన్ పే
- అవినీతిని బహిర్గతం చేసేందుకు పలువురు కాంట్రాక్టర్లు వెనకడుగు
- ఫోన్ పే హిస్టరీ, బ్యాంకు లావాదేవీలు చూస్తే మైండ్ బ్లాక్
- నిజాయితీ జడ్పీ సీఈఓకి ఈ అవినీతి ఓ సవాల్

*జిల్లా పరిషత్ కి అనుసంధానమైన ఆ పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్లోని వామ్మో ఆ జడ్పీ ఏవో అందరూ అవాక్కు చెందేలా మాస్ కలెక్షన్ మొదలు పెట్టాడట. పేరు వినడానికి ఆనందంగా ఉన్న ఆయన వద్ద ఏ కాంట్రాక్టర్ అయినా సరే ఏం బుక్ రికార్డు చేసుకోవాలంటే మాత్రం నేరుగా క్యాష్ తీసుకోవడంతోపాటు ఫోన్ పే అయినా సరే అంటాడట. కేవలం ఆయన మాత్రమే ఆయన చేత మాత్రమే ఎం బుక్ రికార్డ్ చేసుకున్న వాళ్లకు అదే అదే ఆయా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లును సక్రమంగా వస్తాయున్న జూ.. మంతర్ జిమ్మిక్కులు చేస్తున్నాడు. ఈ ఏవో జోలికి ఎవరూ రాకుండా , ఆయన చేస్తున్న అవినీతిని టచ్ చేయకుండా కాదు కాదు కనీసం ఎవరు తాంగి కూడా చూడకుండా సీమలో పేరు మోసిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుల పేర్లను, జడ్పీ లోని పాలకవర్గానికి చెందిన మరికొందరి పేర్లను కూడా తెగ వాడేస్తున్నాడని కార్యాలయంలో కోడై కూస్తోంది.*

**అనంతపురం, ఆగస్టు 13 మనం న్యూస్:** ఆ పి ఆర్ డిపార్ట్మెంట్ కు ఈయన పట్టు పట్టి మరి జిల్లా పరిషత్ నుండి నిత్యం కలెక్షన్ ఉండే ఆ సీటుకు వేయించుకున్నాడని అత్యంత విశ్వసనీయ సమాచారం.

**డ్యూటీ టైమ్ ఈయనే ఫిక్సింగ్?....** వినడానికి కొంచెంకష్టంగా ఉన్నాఅదేనిజం. అదే విషయాన్ని కార్యాలయంలోని అక్కడి సీసీ కెమెరాలు స్పష్టం చేస్తాయి. ఆయన నిర్ణయించుకున్న ఆ డ్యూటీ టైమ్ ఏందో మీకు తెలుసా.. ఉదయమే 6-9 గంటలు, సాయంత్రం 6-9 గంటలు ఇంకా ఏమైనా ఎక్కువ వచ్చేది ఉంటే కొన్ని సందర్భాల్లో సాయంత్రం వేళ ఒక గంట పొడిగించుకొని 10 గంటల వరకుకూడాతనసమయాన్నికార్యాలయంలోగడిపే స్తాడట. అయితే అందరికీ ఇక్కడే ఒక డౌట్ వస్తుంది మిగిలిన అంత సమయాన్ని ఉదయం పూట ఆయన ఏం చేస్తున్నాడుఅని.ఇదిచెబితే ఎవరైనాసరేహౌరా అంటూ ముక్కున వేలేసుకోవాల్సిందేనట.అక్రమంగావచ్చిన ఆ సంపాదనను పే..ఆటలోపెట్టేస్తున్నాడట.అదికూడా మూడు అపార్ట్మెంట్లనునగరంలోఎంచుకొనిఅందులోనే ఈయన విధినిర్వహణలోని ప్రభుత్వ పని వేళలో విలాస జీవితాన్ని గడుపుతున్నాడని తెలిసింది. ఈ ఏవో కు సంబంధించిన మరింత సమాచారాన్ని మనం అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా మరో కథనంలో వివరించే ప్రయత్నం చేస్తాము.

## మడకశిరలో ఆర్డీటీ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం



- విద్యా క్రీడా రంగాల్లో ఆర్డిటి సేవలు ఎంతో అమోగం
- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్‌లు

**మడకశిర,ఆగస్టు 13,మనం న్యూస్:** విద్యా,క్రీడా రంగాల్లో ఆర్డిటి స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు ఏంటో అమోగమని శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్‌లు తెలిపారు.మడకశిర మండలం, పంచాయతీ కేంద్రమైన ఆర్. అనంతపురం ఆర్డిటి ఏరియా కార్యాలయం ఆవరణంలో ఆర్డిటి సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్,ఏద్యుకేషన్ కేంద్రం ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా జిల్లా కలెక్టర్,ఎస్పీ లతో పాటు ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచ్ ఫెర్రర్ లు హాజరయ్యారు.విరితో పాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీ నారాయణ తదితరులు కలసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమడకశిర నియోజకవర్గంలో క్రీడా,విద్యారంగాలఅభివృద్ధికి ఆర్డిటి మరో ముందడుగు వేయడం చాలా సంతోషంగా

మిగతా 2లో



## విచారణ ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని నాయక్ నగర్‌లో ఉన్న 49వ సచివాలయం కిందనున్న 179, 180, 181 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా జరుగుతున్న విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో ప్రక్రియలో భాగంగా ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాలో పేర్ల సవరణలు, వ్యత్యాసాలు (అనోమాలీస్ / డిస్క్రిపాన్సీస్ ) ఉన్న ఓటర్లకు బిఎల్ఓల ద్వారా ముందుగానే నోటీసులు అందజేయడం జరగగా, నోటీసులు అందుకున్న ఓటర్లకు సదరు వ్యత్యాసాలపై స్పష్టత కోసం ఏఈఆర్ఓ సమక్షంలో విచారణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం నగరం పరిధిలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, రద్దీ కాకుండా రోజువారీ షెడ్యూల్ ప్రకారం కేటాయించిన సమయాల్లోనే ఓటర్లు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విచారణ ప్రక్రియను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతోసకాలంలోపూర్తిచేయాలనిఅధికారులనుజిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, టిపిఓ ఓంకార్ రెడ్డి, సంబంధిత బిఎల్ఓలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



## అవినీతికి కేరాఫ్...కణేకల్ తహసీల్దార్ కార్యాలయం

**కణేకల్ ఆగష్టు 13 మనం న్యూస్ :** మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ వీఆర్వోపై భూ వివాదాల పరిష్కారం పేరుతో అక్రమంగాడబ్బులు వసూలుచేస్తున్నారనేఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు ఏడేళ్లుగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఆయన.. వివాదాస్పద భూముల విషయంలో మధ్యవర్తిగా వ్యవహరిస్తూ, బాధితులకు అండగా ఉన్నట్లు చూపిస్తూ ఇరువైపుల నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.భూ వివాదాల పరిష్కారం నుంచి తహసీల్దార్ కార్యా లయ ప్రక్రియ, అనంతరం రిజిస్ట్రేషన్ వరకు తమ సమస్యను పరిష్కరిస్తానంటూ ఓ ఉద్యోగి మధ్యవర్తిగా బాధితులతో సంబంధాలు కొనసాగిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వృధ రైతు నుంచి సుమారు లక్ష ల రూపాయలు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్న నేపథ్యంలో ఆ రైతు తన సమస్య తీరక, తీసుకున్న అప్పుకు వడ్డీలు కూడా కట్టలేక పక్షవాతం తో భాదపడుతూ నేటికీ కార్యాలయం చుట్టు తిరిగినా,తన భూ సమస్యను తీర్చమని కుటుంబ సభ్యుల నుండి పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ, ప్రజాధర్బార్ లో ఎమ్మెల్యే కు, మండల తహసీల్దార్ కు వినతి పత్రాలు సమర్పించిన్న ఫలితం సూన్యమని తెలిపారు. వివాదంలో ఉన్న భూమిని అమాయకులకు కట్టబెట్టిన ఘటనలోనూ ఓ బాధితుడు సంవత్సరాలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడని సమాచారం.అయితే ఆ రైతు సమస్య కూడా ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలుస్తోంది. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.బాధితుడి ఆవేదన.. తన తల్లి ఆస్తి కొరకు తనకు ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆ వీఆర్వో ను ఆశ్రయించగా అడిగినంత లంచం ఇవ్వకపోవడం తో చెప్పుతో కొడతా అంటూ బెదిరింపులకు పాల్పడినట్టు ఆరోపణలు కణేకల్ పట్టణానికి చెందిన మరో బాధితుడు ఆరోపించారు.ఈభాధితుడు కూడాఈవిషయంపై ఎమ్మెల్యే, ఆర్డీఓ, తహసీల్దార్ తో పాటు కలెక్టర్‌ను కూడా ఆశ్రయించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నాడు.కలెక్టర్ఆదేశాలు ఉన్నప్పటికీ తన సమస్యపై స్పందన లేకుండా కాలయాపన చేస్తున్నారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వీఆర్వో, తహసీల్దార్ అధికారికంగా తమ వివరణ ఇవ్వాల్సి ఉంది.అధికారుల అండదండలున్నాయా? వీఆర్వోపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలోమండలఅధికారులఅండగా నిలుస్తున్నారంటూ కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను కూడా అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. మరోవైపు ఈ వ్యవహారాల పై వివరణ అడిగిన ఓ జర్నలిస్టును సైతం వీఆర్వో నా ఉద్యోగం నీకు ఇస్తా నీవు పరిష్కరించాలని ఘాటుగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో బాధితుల ఆరోపణలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.భూ వివాదాలు,రెవెన్యూవ్యవహారాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో స్వతంత్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బాధితులను విడివిడిగా విచారించి, డబ్బుల లావాదేవీలపై సమగ్రంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.ఆరోపణలు నిజమా? కేవలం అపోహలా?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ఉన్నతాధికారుల విచారణే. సంబంధిత అధికారయంత్రాంగం తక్షణమే స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సినఅవసరంఉంది. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.మరో కథనంలో..ఈ ఆరోపణలకు సంబంధించిన వీఆర్వో ఎవరు? బాధిత రైతులు ఎవరు? ఎలాంటి భూ వివాదాలు తెరపైకి వచ్చాయి? డబ్బుల వ్యవహారంపై ఎలాంటి ఆరోపణలు ఉన్నాయి? అనే అంశాలపై మరింత వివరాలను ఆధారాలతో పరిశీలించి" మనం దినపత్రిక"పాఠకులకు వెల్లడిస్తుంది.


## మడకశిరలో ఆర్డీటీ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం

ఉందన్నారు. క్రీడా,విద్యారంగాల అభివృద్దే లక్ష్యంగా ఆర్‌డిటి స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభించడం ఈ ప్రాంత విద్యార్థులకు,క్తిడా కారుల అదృష్టమన్నారు.విన్ సెంటే ఫెర్రర్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి), బార్సిలోనా ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా క్రీడలు, డిజిటల్ ఎడ్యుకేషన్, లైబ్రరీ, జీవన నైపుణ్యాల అభివృద్ధికి ఎంతగానో దోహద పడుతాయిన్నారు.ముఖ్యంగా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు అందనున్నాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్-స్కూల్ టోర్నమెంట్ ఫైనల్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్మరు. మడకశిర ప్రాంతంలోని విద్యార్థులు, యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారి భవిష్యత్ అభివృద్ధికి ఎంతగానో దోహదపడనుందన్నారు. ఈ కార్యక్రమంలోఅధికారులుప్రజాప్రతినిధులు,ఆర్‌డిటి ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు,ప్రజలు పాల్గొన్నారు.



## అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డుకు అజయ్ కుమార్ ఎంపిక

### రైతు సేవతో పాటు సామాజిక సేవలో విశేష కృషి.. రచయితగా ప్రజల్లో చైతన్యం




**గార్లదిన్నె ఆగస్టు 13 మనంన్యూస్ :** రైతు సేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, తనవంతు సహకారాన్ని అందిస్తున్న వ్యవసాయ నిపుణుడు, సామాజిక సేవకుడు జి. అజయ్ కుమార్ అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం, నిరుపేదలకు చేయూతనివ్వడం, అన్నదానం, నిత్యావసర సరుకులు, దుప్పట్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, వ్యవసాయ మరియు సామాజిక అంశాలపై రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

రైతు సేవే లక్ష్యంగా..నల్గొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంట గ్రామానికి చెందిన అజయ్ కుమార్.. శ్రీనివాస్, వెంకటరమణ దంపతుల కుమారుడు. వ్యవసాయ రంగంలో నిపుణుడిగా రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ పంటల సాగు, పంటల పరిరక్షణ, పెట్టుబడుల తగ్గింపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల యాజమాన్యం, నేల ఆరోగ్యం తదితర అంశాలపై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.రైతు కేవలం పంటను పండించడం మాత్రమే కాకుండా.. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడిని సాధించి, ఆదాయాన్ని పెంచుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తన లక్ష్యమని అజయ్ కుమార్ చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని సూచిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నారు.

కలం ద్వారా చైతన్యం...వ్యవసాయ నిపుణుడిగా రైతులకు క్షేత్రస్థాయిలో సేవలందించడమే కాకుండా.. సంపాదకీయుడిగా, రచయితగా వ్యవసాయ మరియు సామాజిక అంశాలపై వివిధ దినపత్రికల్లో వ్యాసాలు రాస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు.రైతుల సమస్యలు, వ్యవసాయంలో వస్తున్న మార్పులు, సాగు వ్యయాలు, నేల ఆరోగ్యం, సుస్థిరవ్యవసాయం,ఆధునికసాంకేతికత వంటి వ్యవసాయ అంశాలతో పాటు యువత, విద్య, సామాజిక బాధ్యత, మానవతావిలువలు,సామాజికసమస్యలు వంటి సమకాలీన అంశాలపై ఆయన రచనలు చేస్తున్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను కేవలం వార్తలుగా కాకుండా..వాటి వెనుక ఉన్న కారణాలు, ప్రభావాలు, పరిష్కార మార్గాలను విశ్లేషిస్తూ పాఠకులను ఆలోచింపజేసే విధంగా రచనలు చేయడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది.రైతులసమస్యలకుపరిష్కార మార్గాలను సూచించడంతో పాటు సామాజిక సమస్యలపై ప్రజల్లో చర్చకు, చైతన్యానికిదోహదపడేలాతన కలాన్ని ఉపయోగిస్తున్నారు.

కరోనా సమయంలో అండగా..కరోనా మహమ్మారి సమయంలో అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఆ సమయంలో అజయ్ కుమార్ తనవంతుగా అవసరమైన వారికి సహాయం అందించారు. ఆపదలో ఉన్న వారికి మనోధైర్యం కల్పించడంతో పాటు అవసరమైన చోట ఆర్థికంగా చేయూతనిచ్చారు.కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితుల్లో ఒంటరితనంతో బాధపడుతున్న వారికి ధైర్యం చెబుతూ.. ఆ క్లిష్ట సమయంలో మాన వత్వం, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత ఇచ్చారు.

నిరుపేదలకు చేయూత..ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం, అవసరమైన వారికి దుప్పట్లు పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాల్లోనూ అజయ్ కుమార్ చురుకుగా పాల్గొంటున్నారు.అవసరమైన సమయంలో అందించే చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి ఎంతో విలువైనదే అన్న భావనతో సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తున్నారు.

అన్నదాన కార్యక్రమాలకు సహకారం...అన్నదానం వంటి సేవా కార్యక్రమాల్లోనూ అజయ్ కుమార్ భాగస్వామ్యమవుతున్నారు. కార్యక్రమాల నిర్వహణలో సమయం కేటాయించడంతో పాటు అవసరమైన చోట ఆర్థిక సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్నారు.సేవను ప్రచారం కోసం కాకుండా సామాజిక బాధ్యతగా భావించడం ఆయన సేవా దృక్పథంలో ప్రధానమైన అంశంగా కనిపిస్తోంది.

రైతు సేవ.. సామాజిక సేవ.. ప్రజా చైతన్యం... వ్యవసాయ రంగంలో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ ఒకవైపు రైతు సేవ కొనసాగిస్తూనే.. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ తనవంతు సహకారం అందిస్తున్నారు. అదే సమయంలో తన కలం ద్వారా వ్యవసాయ, సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.రైతు కోసం క్షేత్రంలో అడుగు.. సమాజం కోసం సేవలో అడుగు.. ప్రజల కోసం కలంలో అక్షరం అనే విధంగా ఆయన చేస్తున్న కృషి విభిన్న రంగాల్లో కొనసాగుతోంది.

సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు..రైతు సేవతో పాటుసామాజిక సేవలోచురుకైన భాగస్వామ్యం, నిరుపేదలకు చేయూత, అన్నదానం, దుప్పట్ల పంపిణీ, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, అలాగే వ్యవసాయ మరియు సామాజిక అంశాలపై రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి సేవలను గుర్తించి అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డుకు అజయ్ కుమార్‌ను ఎంపిక చేశారు.ఈఅవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని అజయ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులోనూ రైతు సేవతో పాటు సామాజిక సేవను మరింత విస్తృతం చేస్తూ, తన రచనలద్వారాప్రజాసమస్యలు,వ్యవసాయరంగ సమస్యలు, సమకాలీన అంశాలపైబష్ట్ర మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువతకు స్ఫూర్తిగా..వ్యవసాయ నిపుణుడిగా రైతులకు సేవలందిస్తూ.. రచయితగా ప్రజలను ఆలోచింపజేస్తూ.. ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు తనవంతు చేయూత అందిస్తున్న అజయ్ కుమార్ సేవా ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగానిలుస్తోంది.సమాజం నుంచి పొందడం మాత్రమేకాదు..సమాజానికిమనవంతుగా తిరిగి ఇవ్వాలనే ఆలోచన ప్రతిఒక్కరిలోఉండాలి అనే సందేశంతో యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిస్తున్నారు.అజయ్ కుమార్‌ను అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డుకు ఎంపిక చేయడంపై పలువురు అభినందనలు తెలిపారు.రైతుసేవ,సామాజికసేవ,ప్రజాచైతన్య కార్యక్రమాల్లోఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# నేతన్న సేవపై అసత్య ప్రచారం మానుకోవాలి

- నేతన్నల సంక్షేమంపై మాట్లాడే ముందు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలకు సమాధానం చెప్పాలి
- డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా చేపట్టాం.. హత్య ఘటనను పక్కదారి పట్టించేందుకే రాజకీయ డ్రామాలు



**ధర్మవరం, ఆగస్టు 13, మనంన్యూస్ :** నేతన్నల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నాయకులుబీజేపీ ధర్మవరం రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర, బత్తలపల్లి మండల అధ్యక్షుడు భాస్కర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నేతన్న సేవ పథకం, డీఎస్సీ నియామకాలు, ఇటీవల జరిగిన హత్య ఘటనపైచేస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. ఆధారాలతోమాట్లాడాలని, రాజకీయ ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని సూచించారు. గురువారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధర్మవరం రూరల్ బీజేపీ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర తదితరులు మాట్లాడారు. అర్హులైన ప్రతి నేతన్నకూ ప్రయోజనంకూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకం కింద అర్హులైన చేనేత కార్మికుల ఖాతాల్లో ఆగస్టు 7న ఆర్థిక సాయం జమ చేసినట్లు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో అర్హుల సంఖ్యపై వచ్చిన సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా, నిజమైన చేనేత కార్మికుడికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ వద్ద సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తున్నారని, అర్హత ఉన్న ఒక్క నేతన్న కూడా మిగిలిపోకుండా చూడటమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు కూడా జిల్లా చేనేత, జౌళి శాఖ ద్వారా అవకాశం కల్పించినట్లు తెలిపారు. నేతన్న నేస్తంపై అప్పట్లోనే ఫిర్యాదులుగత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'నేతన్న నేస్తం' లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదులు వచ్చిన విషయాన్ని బీజేపీ నాయకులు ప్రస్తావించారు. 2020లో అనంతపురం జిల్లా కలెక్టరేట్‌నుంచి జారీ చేసిన నోటీసులో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై విచారణకు జాయింట్ కలెక్టర్‌నునియమించినట్లు పేర్కొన్నారని తెలిపారు. అందువల్ల నేతన్నల సంక్షేమంపై మాట్లాడే ముందు గతంలో వచ్చిన ఫిర్యాదులపై కేతిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీపై ఆరోపణలు అర్థరహితం కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని బీజేపీ నాయకులు అన్నారు. సుమారు 5.77 లక్షల మంది అభ్యర్థులు దాదాపు 16 వేల ఉద్యోగాల కోసం పోటీపడినఈప్రక్రియలోపారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినా అమలు చేయలేదని విమర్శించారు. హత్య ఘటనను రాజకీయంగా వాడుకోవద్దు ధర్మవరం నియోజక వర్గంలో ఇటీవల జరిగిన దాసరి శ్రీనివాసులు హత్య కేసులో పోలీసులు నిందితులను గుర్తించి కోర్టు ముందు హాజరుపరిచారని తెలిపారు. దర్యాప్తు సంస్థలు వాస్తవాలను వెలికి తీసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఒక కుటుంబ పెద్దను కోల్పోయిన నేపథ్యంలో శ్రీనివాసులు కుటుంబానికి అండగా నిలిచేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి విషయం తీసుకెళ్లామని, పిల్లల విద్యకు సహాయం అందించే అంశంలో మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. హత్య ఘటనను పక్కదారి పట్టించేందుకే నేతన్న సేవ వంటి సంక్షేమ అంశాలను రాజకీయంగా తెరపైకి తెస్తున్నారని కేతిరెడ్డిపై విమర్శలు చేశారు. గత పాలనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలిరెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో తన పాలనపై వచ్చిన ఆరోపణలు, వివిధ పథకాల అమలుపై వచ్చిన ఫిర్యాదులకు ముందుగా సమాధానంచెప్పాలనిబీజేపీ నేతలు సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని నిబం ధనల ప్రకారం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునితీసుకుంటోందని పేర్కొన్నారు. బీసీలు, చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాంధర్మవరం నియోజక వర్గంలోబీసీలు,చేనేతకార్మికులు, ఇతర వెనుకబడిన వర్గాలసంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజల సమస్య లను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు కొంకా నాగార్జున, పనిశెట్టి శివశంకర్, ఓం ప్రకాష్ గౌడ్, జూటూరు వెంకటేష్, పెద్దకోట్ల ఆనంద్, నరేష్, అరవింద్, కార్యకర్తలు, చేనేత రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వనం-మనం కార్యక్రమంలో మొక్కలు నాటిన మానవ హక్కుల పరిరక్షణ సంస్థ

– పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి.. ఎస్సై నభి రసూల్



**బొమ్మనహాళ్, ఆగస్టు 13 మనంన్యూస్ :** పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనేలక్ష్యంతో జాతీయమానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులతోకలిసి మొక్కలు నాటారు. జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఫౌండర్ చైర్మన్ టి. రామచంద్ర నాయుడు, సీఈవో, రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.కృష్ణారెడ్డిఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడు హరేసముద్రం రాముడు, డా. శంకర్, నేమకల్లు వైస్ ప్రెసిడెంట్, కనేకల్ మండల అధ్యక్షుడు బి. వెంకటేష్ తెలిపారు. ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. నభిరసూల్ పాల్గొని మాట్లాడుతూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలను పెం చడం ద్వారాపరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావ రణం ఏర్పడటంతో పాటు భావితరాలకు మేలు జరుగుతుందన్నారు. నాటిన మొక్కలు వృథా కాకుండా విద్యార్థులు వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని కోరారు. విశిష్ట అతిథిగా డిప్యూటీ ఎంపీడీవోఎస్.వెంకటరమణ పాల్గొన్నారు. కార్యక్రమంలోఎంఈవోలు వీరన్న, మల్లికార్జున, హెచ్ఎం పి. సుధాకర్, పీఈటీ సుధాకర్, ఉపాధ్యాయుడు చంద్‌బాషా, విద్యార్థులు, జాతీయ మానవ హక్కుల పరిరక్షణసంస్థప్రతినిధులుతదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిశితంగా పూర్తి చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్



**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 13 మనంన్యూస్ :** అమరావతి, వెలగపూడిలోని ఏపీ సెక్రటేరియట్ లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) – 2026పై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, డిఆర్ఓ ఏ.మలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలకుసంబంధించిఈనెలఇప్పటివరకు సుమారు 3,400 దరఖాస్తులు రాగా, వాటిని నిశితంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేస్తా మన్నారు. ఇప్పటివరకు ప్రతి నియోజకవర్గానికి రోజుకు 1,000 చొప్పున, అనంతపురం అర్బన్ పరిధిలో రోజుకు సుమారు 2,500 విచారణలు చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నోటీసుల జారీ ప్రక్రియ రాబోయే ఐదారు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఏఈఆర్ఓ ( ఏఈ ఆర్ ఓ )లకు సహకరించడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించాలని లేదా కనీసం ఒకనెల రోజుల పాటు అదనపు సిబ్బందిని అందించాలని ఉన్నతాధికారులను కోరడం జరిగిందన్నారు. స్పెషల్ క్యాంపైన్ డేస్ కు తగిన విస్తృత ప్రచారం కల్పిస్తూ, కేటాయించిన 4 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయనున్నామన్నారు. ఎన్‌జిఎస్‌పి పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ద్వారా సమన్వయం చేసుకుంటూ త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఇతర సాంకేతిక లేదా నిర్వహణ సమస్యలు లేవన్నారు.

## జ్ఞాన జ్యోతితో పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట

– శిక్షణలో ప్రభుత్వ టీచర్లు,సూపర్వైజర్లు



**అనంతపురం, ఆగస్టు 13 మనంన్యూస్:** చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధనలో మెలకువలను స్క్రీనింగ్ ద్వారా జ్ఞానజ్యోతిట్రైనింగ్ అంగన్వాడి వర్కర్స్ అందరికీ ఇవ్వడం జరిగింది. గురువారం నేతాజీ మున్సిపల్ స్కూల్ నందు ట్రైనింగ్ లో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పవన్ కుమార్, సోమ శేఖర్, జయప్రకాష్ లు, సూపర్వైజర్లు విజయలక్ష్మి, ఇది వేలు, హేమలత మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలను ఎలా విద్య వైపు సంసిద్ధం చేయాలి, పాఠ్య ప్రణాళికలను ఏ విధంగా రూపొందించుకోవాలి, ఆటపాటలతో విద్యను ఏ విధంగా బోధించాలి, ఇలాంటి మంచి ట్రైనింగ్స్ ద్వారా పిల్లలు భవిష్యత్తుకు బంగారుబాటలు వేసేందుకుతోడ్పడతాయన్నారు. ఈశిక్షణలో ప్రత్యేకంగా నవ చేతన ఆధార్ షీలా గురించి ఎక్కువ సమయానికి కేటాయించి బోధించారు.

## ఘనంగా స్వాతంత్ర్య సమయోధులు శ్రీరామరెడ్డి వారి 33వ వర్ధంతి వేడుకలు



**మడకశిర,ఆగస్టు 13,మనంన్యూస్:** స్వాతంత్ర్య సమరయోధులు,మాజీ పార్లమెంట్ సభ్యులుస్వర్గీయ కీర్తి శేషులు నీలకంఠా పురం శ్రీరామ రెడ్డి 33వ వర్ధంతి వేడుకలను గురువారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు డాక్టర్ జయరాం,మాజీ మంత్రి డాక్టర్ రఘువీరారెడ్డి సతీమణి శ్రీమతి సునీత రఘువీర్‌తో పాటు విద్యార్థులతో కలసి స్వర్గీయశ్రీరామరెడ్డి ఘాట్ చేరుకుని సమాధికి పూలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోదుడు నీలకంఠాపురంశ్రీ రామరెడ్డి వర్ధంతి సందర్భంగా నీలకంఠాపురం జిల్లా పరిషత్ విద్యార్థులు, ఉపాధ్యా యులు కుటుంబసభ్యులు కలసి రఘువీరారెడ్డి నివాసం లో శ్రీరామరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీరామరెడ్డి దేశంకోసంకోసం, ముఖ్యంగా మడకశిర ప్రాంత ప్రజలు,విద్యార్థులు,పేదలు,ప్రజలకోసం చేసిన త్యాగాలను, వారు అందించిన అమూల్యమైన సేవలను కొనియాడారు. శ్రీరామరెడ్డివారిని స్మరించుకున్నారు. యువత వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు ముగ్గురి ఎంపిక

**ధర్మవరం ఆగస్టు 13 మనంన్యూస్ :** కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో జీ.వీ. జెడ్పీజీహెచ్ఎస్ విద్యార్థిని బి.ప్రణీతరాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈసందర్భంగా ప్రధానో పాధ్యాయురాలు వై. సుమన, పీడీ స్వరూప, పీటీ సరళ, ఉపాధ్యాయులు ప్రణీతను అభినందించారు. ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ-కోచింగ్ సెంటర్ క్రీడాకారులు ఏ. ఉదయ్ (-68 కిలోలు), కొండఅర్చన (-52కిలోలు) కూడాఎంపికైనట్లుకోచ్‌ఇనాయత్‌భాషా తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# అర్హత ఉన్న ప్రతి చేనేతకు నేతన్నసేవ అందుతుంది



- వైసీపీ ట్రాప్‌లో పడి.. గందరగోళానికి గురి కావద్దు
- చేనేత కార్మికులకు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచన
- అధికారులపై మీ భాష మార్చుకోండి.. ఇది వైసీపీ పాలన కాదు
- చేనేతలకు డబ్బు అందిందని పురుగులమందు తీసుకొస్తారా
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి పరిటాల శ్రీరామ్ కౌంటర్
- ఈనెల 14వరకు అర్హత ఉన్న చేనేతలు దరఖాస్తు చేసుకోవచ్చన్న శ్రీరామ్

**ధర్మవరం, ఆగస్టు 13, మనంన్యూస్ :** అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికునికి.. నేతన్న సేవ పథకం ద్వారా 25వేల సాయం అందుతుందని.. ఈవిషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. గతనాలుగైదు రోజులుగా నేతన్న సేవపై నెలకొన్న ఆందోళనపై శ్రీరామ్ స్పష్టతనివ్వడమే కాకుండా.. వైసీపీ నాయకుల విమర్శలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులు చూసి.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, సవిత చొరవ తీసుకుని నేతన్న సేవ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈనెల 7న చేనేత దినోత్సవం సందర్భంగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించా రన్నారు. పథకం ప్రారంభం రోజున కొంతమంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లోకి 25వేల రూపాయలు జమ అయిందన్నారు. వారాంతపు సెలవులు, సాంకేతిక సమస్యల కారణంగా డబ్బు జమ చేయడంలో కొంత మేర ఆలస్యం జరిగిందన్నారు. అయితే ఇప్పటికే దాదాపు 90 శాతం మంది చేనేత కార్మికులకు పథకం అందిందన్నారు. మిగిలిన 10శాతం మందికి కూడా వారం పదిరోజుల్లో కచ్చితంగా నగదు జమ అవుతుందన్నారు. గతంలో అమలు చేసిన సిక్స్ స్టెప్ వాల్యూ యేషన్ కారణంగా, బ్యాంక్ అకౌంట్ కు ఆధార్ అనుసంధానం కానీ అకౌంట్స్ వంటి కారణాలతో నగదు జమ కాలేదన్నారు. వాటిని పరిష్కరించే విధంగా తాము చొరవ తీసుకుంటున్నా మన్నారు... వైసీపీ ట్రాప్‌లో పడి ఎవరూ ఆందోళన చెందవద్దు.. శ్రీరామ్...గత ప్రభుత్వం కంటే ఎంతో పారదర్శకంగా నేతన్న సేవ పథకాన్ని అమలు చేస్తుంటే.. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డితో పాటు మరికొందరు ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తున్నారని శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతన్న సేవ పథకం రాష్ట్రంలో 71,536 మంది నేత కార్మికులకు అందుతుంటే.. అందులో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కార్మికులే 12వేల మంది ఉన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికలు ఉన్నాయని చేనేతలపై ఎక్కడా లేని ప్రేమను చూపిస్తూ.. మాజీ ఎమ్మెల్యే నిరసనలు చేస్తున్నారన్నారు. వాస్తవంగా తన వద్దకు కూడా కొందరు కార్మికులు డబ్బు పడలేదని వచ్చారని.. అయితే అదే రోజు రాత్రే వారికి డబ్బు పడిందన్నారు. ఇది నా వలనో, మంత్రి సత్యకుమార్ వలనో జరగలేదని.. కేవలం వారికి అర్హత ఉంది కాబట్టే పడిందన్నారు. చివరకు కేతిరెడ్డి నిరసన సమయంలో ఆయన చుట్టూ ఉన్న వారికి కూడా డబ్బు పడిందన్నారు. ఇంకా పది రోజుల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అయితే మగ్గాలు లేని ఊర్ల నుంచి జనాన్ని తీసుకొచ్చి ఇంత మంచి పథకంపై బురద జల్లుతున్నారన్నారు. మెగా డీఎస్సీ విషయంలో కూడా ఇలాగే రాద్ధాంతం చేస్తూ.. మంత్రినారాలోకేష్ రాజీనామా చేయాలంటు న్నారన్నారు. పైగా మాజీ ఎమ్మెల్యే అధికారుల విషయంలో మాట్లా డుతున్న భాష కూడా సరైంది కాదన్నారు. గత వైసీపీ హయాంలో సచివాలయాల వద్దకు వెళ్లి సిబ్బందిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడినట్టు.. ఇప్పుడు అదే దోరణలో ఉన్నారన్నారు. ఈనెల 15వ తేదిన పుంగుల మందు డబ్బాలతో ఎం దుకు వస్తారని నిలదీశారు. చేనేతలందరికీ ఈ పథకం అందిందనే బాధతో మీరేమైనా వస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి దోరణి మానుకుని.. అర్హులకు ఎక్కడ పథకం అందలేదో ఒక్కసారి సమాధానం చెప్పా లన్నారు. పథకం అందని కార్మికులకు ఈనెల 14వ తేది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసు కోకుంటే పథకం అందదని శ్రీరామ్ స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కూడా పనికిమాలిన స్టేట్ మెంట్లు మానేసి అర్హత ఉన్న వారితో దరఖాస్తు చేయిస్తే ఉపయోగం ఉం టుందన్నారు. మరోవైపు డబ్బు డిమాండ్ చేసినట్టు వచ్చిన ఆడియో కాల్స్ విషయంపై కూడా శ్రీరామ్ స్పందించారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు డబ్బు గురించి మాట్లాడినట్టుగా ఉందని.. వారెవరన్నది కూడా స్పష్టంగా లేదన్నారు. ఇలాంటివన్నీ చేనేతలు ఎవరూ నమ్మవద్దని.. ఎవరికీ డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బు తీసుకున్నట్టు తెలిస్తే ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత కార్మికులు వైసీపీ ట్రాప్ లో పడి ఆందోళనకు గురికావద్దని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకం అందుతుందని శ్రీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపాపట్టణఅధ్యక్షుడు సుధాకర్, క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, సంధారాఘవ, కమతం కాటమయ్య, భీమనేని ప్రసాద్ నాయుడు, పురుషోత్తం గౌడ్, మాధవరెడ్డి, పురుషోత్తం, మేకల రామాంజనేయులు, సుబ్బయ్య, షరీఫ్, నాగూర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మడకశిరకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ రాక

- ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లే ఔట్లు వసతులు కల్పనకు శంకుస్థాపన
- అఖిల భారత చిరంజీవి యువత సీనియర్ జనసైనికుడు వెంకటేష్ గుప్తా



**మడకశిర,ఆగస్టు 13,మనంన్యూస్:** నేడు శుక్రవారం మడకశిరకు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ వస్తున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత,చిరు,పవన్ కళ్యాణ్ ఫాన్స్ అసోసియేషన్ మడకశిర నియోజకవర్గం అధ్యక్షుడు,జనసేన సీనియర్ నాయకుడు వెంకటేష్‌గుప్తా తెలిపారు.గురువారం విలేకరులతో అయన మాట్లాడుతూ అహుడా చైర్మన్‌తో పాటు,ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ,రాష్ట్ర కుంచిటి వాక్కాలిగ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీ నారాయణ, అధికారులు, తదితరులు కలసి మడకశిర పట్టణంలోని ఎన్టీఆర్ లే ఔట్ లో మౌలిక వసతులు కల్పనకు శంకుస్థాపన చేయనున్నట్లు అయన తెలిపారు. కావున మడకశిర నియోజక వర్గంలోని చిరు,పవన్ కళ్యాణ్ అభిమానులు,జనసైనికులు,టిడిపి,బిజెపి నాయ కులు, ప్రజాప్రతినిధులు,అధికసంఖ్యలో కూటమిశ్రేణులుఅధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేయాల్సిందిగా వెంకటేష్ గుప్తా కోరారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**లేపాక్షి,ఆగస్టు 13,మనంన్యూస్:** లేపాక్షి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈఓలు 1,2, జిజెసిప్రిన్సిపాల్,హెచ్‌ఎంలు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ ఐక్యత, దేశభక్తి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ర్యాలీ సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమం మండల కేంద్రంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.



## నేతన్న సేవలో అవినీతి అక్రమాలపై ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలి

- సచివాలయాల్లో అక్రమాలపై హ్యాండ్‌లూమ్ ఏడీ నైతిక బాధ్యత వహించాలి
- ఏపీ చేనేత కార్మిక సంఘం సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ

**ధర్మవరం ఆగస్టు 13 మనం న్యూస్ :** నేతన్న సేవ పథకం అమలులో చోటుచేసుకున్న అవకతవకలపై ఐఏఎస్ అధికారితో సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సచివాలయాల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు హ్యాండ్‌లూమ్ ఏడీ నైతిక బాధ్యత వహించాలని కోరారు.ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌తో కలిసి వెంకటనారాయణమాట్లాడారు.చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేతన్న సేవ పథకాన్ని అమలు చేసిందన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న చీరాలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు.అయితే పథకం అమలులో




నిజమైన చేనేత కార్మికులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. మగ్గం ఉన్న పలువురు చేనేత కార్మికులకు పథకం సొమ్ము జమ కాకపోగా, అనర్హులకు నగదు జమ అయినట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.పథకం అందని వారికి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకుఅవకాశంకల్పించామనిహ్యాండ్‌లూమ్ అధికారులు తెలిపారని, రేపు సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఈసారి అయినా హ్యాండ్‌లూమ్ అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి మగ్గం ఉన్న ప్రతి అర్హత కలిగిన చేనేత కార్మిక కుటుంబాన్ని గుర్తించి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.రెండో విడత నిధులు ఎప్పటిలోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారో అధికారులు స్పష్టంగా వెల్లడించాలని కోరారు. ఈ విడతలోనూ అనర్హులకు నిధులు మంజూరు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనికి హ్యాండ్‌లూమ్ ఏడీ, మున్సిపల్ కమిషనర్,సచివాలయసిబ్బందిబాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.చేనేత కార్మికుల ఖాతాల్లో నేతన్న సేవ పథకం నిధులు జమ కాకపోతే జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులతో కలిసి చేనేత మంత్రి సవితమ్మ ఇంటిని ముట్టడిస్తామని వెంకటనారాయణ హెచ్చరించారు.సమావేశంలో చేనేత నాయకులు శ్రీనివాసులు, శివ, సంకారపు రాజా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవుని సన్నిధిలో శ్రావణమాస అమావాస్య పూజలు



- కూష్మాండ దీపోవత్సంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- 2రోజుల పాటు పూజలు, కంకణదారణ, అన్నదానం
- ప్రతి శనివారం శ్రావణమాస పూజలంటాయన్న పూజారి ధనుంజయఆచారి


**ధర్మవరం ఆగష్టు 13,మనం న్యూస్ :** ఆషాఢ మాసం ముగింపు, శ్రావణమాస ప్రారంభం వచ్చే చుక్కల అమావాస్య సందర్భంగా ధర్మవరం పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ సన్నిధిలో ఉన్న అమ్మవారికి ముత్తైదువుల ద్వారా పూజా కార్యక్రమాలు చేశారు. ఆ తర్వాత అమావాస్య గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ్ ఆచారి దోష నివారణపూజలుచేశారు. కాలభైరవునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్సవ మూర్తికి భక్తులచే అభిషేకాలు చేయించారు. ప్రదోష కాలం, అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. ధర్మవరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తునతరలివచ్చిపూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి.. భైరవునికి పూజలు చేశారు. అమావాస్య తరువాత కంకణ దారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వద్ద పూజించిన గుమ్మడికాయలను, కొబ్బరికాయలను, కంకణాలను భక్తులకు అందజేశారు. ఆ తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ధనుంజయ ఆచారి




మాట్లాడుతూ శ్రావణమాస ప్రారంభంలో వచ్చే అమావాస్యను చుక్కల అమావాస్యగా పిలుస్తారని.. ఆరోజున కొన్ని పరిహారాలు చేస్తే అంతా మంచే జరగడమే కాకుండా జాతకంలో దోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయన్నారు. శ్రావణ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో ఆలయ సన్నిధిలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయని తెలిపారు..

# స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

## మంత్రి నారా లోకేష్‌తో వర్శిటీ విశేషాలు పంచుకున్న సునీతమ్మ



**చెన్నేకొత్తపల్లి ఆగస్టు 13 మనంన్యూస్ :** అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను రాప్తాడు ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. నారా లోకేష్ ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలలో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించానని.. ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూని వర్సిటీలో నారా లోకేష్ చదవడం చాలా ఆనం దంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచ వ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసు కున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది నారా లోకేష్ ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్సిటీలోచదువుకున్నారుకాబట్టే.. రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలు గుతున్నారన్నారు. రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నారంటే ఇక్కడ పొందిన విజ్ఞానంఅనిఅర్థమవుతోందన్నారు.ఇలాంటి యూనివర్సిటీలో చదివినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్వీయూని వర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. నారా లోకేష్ ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు...



# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**పెనుకొండ ఆగస్టు 13 మనంన్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు గురువారం పెనుకొండ పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ ర్యాలీనిజాతీయ జెండాను ఊపి ప్రారంభించారు.విద్యార్థినీ విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకొని, దేశభక్తి నినాదాలు చేస్తూ పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీగా సాగారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి జాతీయ భావాలను పెంపొందించుకోవాలని, దేశ నాయకులను స్మరించుకుంటూ దేశభక్తి స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద లేదా కార్యాలయం వద్ద ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కె. సుదర్శన్ మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. విద్యార్థులు ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే విద్యార్థినీ విద్యార్థులు 'విజన్ 2047' లక్ష్యాన్ని ఎంచుకొని, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి దేశాల సరసన నిలిచేలా తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎస్.ఎన్. మూర్తి, ఉమా శంకర్, సీనియర్ అసిస్టెంట్ అల్లా బకాష్, ఎన్ఎస్ఎస్ పీఓలు డి. శివన్న, ఎస్. హాఫీజ్, కె. రవికుమార్, ఆర్ఆర్సీవిజయప్రకాష్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కూటమి నాయకులు, సచివాలయాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# అగ్రోఎకాలజీ ఆధారిత జీవనోపాధుల కార్యక్రమం




**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 13 మనంన్యూస్:** స్థానిక మండల కేంద్రము సమీపాన ఉన్న చింత వనము టింబక్టు కలెక్టివ్ కార్యాలయము ప్రాంగణములో గురువారము మహిళా రైతుల సుస్థిర జీవనోపాధులను బలోపేతం చేయడం, సేంద్రియ కూరగాయల సాగును మరింత విస్తరించడం, రైతులకు అవసరమైన ఇన్‌పుట్లు, శిక్షణ మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను కల్పించే లక్ష్యంతో మహిళా రైతుల కోసం అగ్రోఎకాలజీ ఆధారిత జీవనోపాధులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ చైర్‌పర్సన్ బబ్లు గంగూలీ మాట్లాడుతూ మహిళా రైతులతో సేంద్రియ కూరగాయల సాగు కార్యక్రమం కొనసాగుతున్న తీరును వివరించి, రాబోయే కాలంలో ఉత్పత్తులతో పాటు మార్కెటింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. మహిళా రైతులు తమ అనుభవాలను, భవిష్యత్ ఆలోచనలను పంచుకున్నారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ కార్యదర్శి మేరీ వట్టమట్టం మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర ఎంతో కీలకమని, యువతను కూడా మార్కెటింగ్‌లో భాగస్వామ్యం చేయడం ద్వారా రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించవచ్చని అన్నారు. రైతులు-వినియోగదారుల మధ్య ప్రత్యక్ష మార్కెటింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు దేశీ విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, వేపపిండి, కానుగ పిండి, ఓపెన్ బెడ్ నర్సరీ సామగ్రి, జీవ ద్రావణల తయారీకి డ్రమ్స్ తదితర ఇన్‌పుట్లను అందించారు. ఈ కార్యక్రమం ద్వారా 450 మంది మహిళా రైతులకు సేంద్రియ కూరగాయల సాగులో సామర్థ్య పెంపు, అవసరమైన ఇన్‌పుట్ల లభ్యత, కూరగాయల సేకరణ మరియు మార్కెటింగ్‌కు మరింత మద్దతు అందించనున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య , ఆర్గానిక్ ప్రోగ్రాం మేనేజర్ మహేష్, ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ రమేష్ కుమార్, సేంద్రియ కూరగాయల సంఘాల నాయకులు , సభ్యులు, ఫీల్డ్ టీం మరియు ఎంటర్ప్రైజెస్ టీం, ఇతర ప్రోగ్రాం నాయకులు పాల్గొన్నారు.






# జాతీయ వినియోగదారుల సదస్సుకు జాయింట్ కలెక్టర్‌ను ఆహ్వానించిన వినియోగదారుల సంఘాల సమాఖ్య

**పుట్టపర్తి ఆగస్టు 13 మనంన్యూస్ :** సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఐఏఎస్‌ను రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఆహ్వానించారు.గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి సదస్సు ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య, జాతీయ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డిని కూడా సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వినియోగదారుల సదస్సుకు పౌర సరఫరాల శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిఏపిసిఓచైర్మన్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, నాణ్యత ప్రమాణాలు, వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ అన్నదాత రామిరెడ్డి, సిఏపిసిఓ సభ్యులు చిన్నతంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పళ్లెం జనార్ధన్, ధర్మవరంమండల జనరల్‌సెక్రటరీగుర్రంవేణుగోపాల్, ఉపాధ్యక్షులు యజ్ఞన్న, బుక్కపట్నం మండల అధ్యక్షులు ఎం. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, సభ్యులు ఆవుల విష్ణు, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక మార్చుకోవాలి

**ధర్మవరం ఆగస్టు 13 మనం న్యూస్ :** ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు రక్షక తడులు అందించి బెట్ట పరిస్థితి నుంచి కాపాడుకోవాలని తెలిపారు. పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటికి 5 గ్రాములు లేదా 19:19:19 ఎరువును లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటలను బెట్ట పరిస్థితుల నుంచి 15 నుంచి 20 రోజుల వరకు కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు డా. ఎం. విజయ శేఖర్‌బాబు, డా సి.రాధాకుమారి, డా. జి.నారాయణస్వామి, సీనియర్ శాస్త్రవేత్త డా. ఆర్. నరసింహులు వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ సూచనలను అనుసరించి పంటల సాగు ప్రణాళికను మార్చుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని దర్శనమల, నేలకోట, ఎలుకుంట్ల, బిల్వంపల్లి గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితులను పరిశీలించారువర్షాలను సద్వినియోగం చేసుకోవాలి రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న భూములు, బీడు భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. కొర్రలు, సజ్జలు వంటి చిరుధాన్యాలతో పాటు ఉలవలు, పెసర, మినుము, అలసంద వంటి అపర పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు పంటల బీమా చేయించుకోవడంతో పాటు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. వివిధ పంటల్లో పాటించాల్సిన నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ పర్యటనలో, రైతు సేవా కేంద్రం సిబ్బంది నందిని, రాజేశ్వరి, బాబు, శిల్ప పాల్గొన్నారు.



## ఏఎం లింగన్న క్యాంపస్‌లో చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్షా కేంద్రం ప్రారంభం

- ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డాక్టర్ రఘువీరారెడ్డి
- సంస్థ ప్రతినిధులు నిరంజన్ మురళీ కృష్ణలు




**మడకశిర,ఆగస్టు 13,మనం న్యూస్:** నేడు శుక్రవారం ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సౌజన్యంతో సేవామందిరం ఏఎం లింగన్న క్యాంపస్‌లో చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్ష కేంద్రం ను ప్రారంబిశే చనున్నట్లు ఎల్ వి ప్రసాద్ సంస్థ ప్రతినిధులు నిరంజన్,మురళీకృష్ణలు తెలిపారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూఈకార్యక్రమానికిముఖ్యఅతిథులుగా మాజీమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి హాజరైవుతారన్నారు. సేవామందిరంలోఉచిత కంటి పరీక్షలు నిర్వహించేందుకు కొత్తగా కేంద్రాన్ని స్థాపించడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడు తుందని వారు తెలి పారు. ఇక్కడప్రాథమిక పరీక్షల అనంతరం మెరుగైన చికిత్సలు అవసరమయ్యే వారికి నీలకంఠాపురం,కడప, హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞానసంస్థ నేత్రాలయంలకు సిఫారసు చేయడం జరుగు తుందన్నారు. నేడు జరిగేసేవా మందిరంలోకంటిపరీక్షా కేంద్రంకార్యక్రమాన్నిజయప్రదం చేయా ల్సిం దిగా సేవామందిరశ్ విద్యా సంస్థల చైర్మన్,ఏఐ సీసీ సభ్యుడు కేటీ శ్రీధర్ కోరారు.

# అనే నేను!

- ఈనెల 14న ప్రతి ఒక్కరూ ఒక మొక్కని నాటుదాం
- కష్టం లేకుండా ఇష్టంగా చదువుల్లో రాణించండి
- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అయూబ్ హుస్సేన్



**బుక్కరాయసముద్రం ఆగస్టు 13, మనంన్యూస్:** బుక్కరాయసముద్రం మం డల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముం దుగా జాతీయ గీతాలాపనలో పాల్గొని పాఠశాలలోనే విద్యార్థుల చదువు గురించిఆరాతీశారు.అనంతరంవిద్యార్థులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ మును పురస్కరించుకొని " పార్టనర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్' అనే థీ మ్‌తో నిర్వహిస్తున్న " అనే నేను" కార్యక్రమం గురించి 14 వ తేది ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి రక్షించాలని, పర్యావరణాన్ని కాపాడాలి. అని తెలియ జేశారు జిల్లా విద్యాశాఖ అధికారి. ప్రణాళికా బద్ధంగా కష్టంతో కాకుండా ఇష్టం తో చదివి ఉన్నత స్థితికి ఎదగాలని విద్యార్థులందరికీ సూచించారు . 10 వతరగతి విద్యార్థులతో సమావేశమై విద్యార్థులకు ఒక లక్ష్యం పెట్టు కొని ఇప్పటినుంచేఆలక్ష్యంనెరవేర్చుకోవడానికిఆత్మవిశ్వాసంతో చదివి తల్లిదండ్రు లకు,పాఠశాలకుమంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులకు కూడాపలుసూచనలుచేశారు.పాఠశాలఆవరణలోమొక్కను నాటడం జరిగినది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## “బద్లావ్ జరూరీ హై - దేశ్ కో బచావో, మోడీ హటావో” నినాదంతో 19న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



- సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్

**అనంతపురం, ఆగస్టు 13 మనంన్యూస్ :** సీపీఐ జాతీయ, రాష్ట్ర సమితులు, అనుబంధ ప్రజా సంఘాల పిలుపు మేరకు “బద్లావ్ జరూరీ హై – దేశ్ కో బచావో, మోడీ హటావో” నినాదంతో ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార గోడపత్రికను అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా మరింత పెంచుతున్నాయని విమర్శించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని పాలకులు చెబుతున్నప్పటికీ, నేడు యువత చేతుల్లో ఉద్యోగ నియామక పత్రాల కంటే ఉద్యోగ దరఖాస్తులు, హాల్‌టికెట్లు, కోచింగ్ ఫీజు రసీదులు, విద్యా రుణాల పత్రాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను సంవత్సరాల తరబడి నిరీక్షణలో ఉంచుతున్నారని విమర్శించారు. పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీకులు, ఫలితాల జాప్యం, నియామక ప్రక్రియలో అవకతవకల కారణంగా యువత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉద్యోగం కోసం సిద్ధమవుతూ వయో పరిమితి దాటిపోతున్న పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేసి పూర్తిస్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కోచింగ్ కోసం అప్పులు చేసి, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోస్తూ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతను నోటిఫికేషన్ల జాప్యం, పరీక్షల వాయిదాలు, ఫలితాల ఆలస్యం తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 11,639 పోలీస్ శాఖ పోస్టులకు, ఇందులో ఎస్ఐ, కానిస్టేబుల్, హోంగార్డ్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ నియామకాల్లో గరిష్ఠ వయో పరిమితిని 38 సంవత్సరాలకు పెంచి, నిరుద్యోగ యువతకు వయో సడలింపు కల్పించాలని కోరారు.2025 మెగా డీఎస్సీ నియామకాల్లో ప్రశ్నపత్రాల లీకేజీ, మెరిట్ జాబితాల్లో అక్రమాలు, స్పోర్ట్స్ కోటా దుర్వినియోగంపై హైకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకులు, నియామక అవకతవకలను అరికట్టి పారదర్శక నియామక వ్యవస్థను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. ఎమ్మెస్ ఎంఈ రంగానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించి స్థానిక యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని, వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి యువత వలసలను అరికట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.దేశ యువతకు ఉపాధి హక్కును చట్టబద్ధంగా కల్పించి, ఉద్యోగం కోరుకునే ప్రతి యువకుడికి ప్రభుత్వం బాధ్యత వహించే విధంగా విధానాలను రూపొందించాలని కోరారు. ఈ సంధ్బంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దేశ యువత భవిష్యత్తును కాపాడేందుకు నిర్వహిస్తున్న ఈ పోరాటంలో నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలనిఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసనలను విజయవంతం చేయడంతో పాటు, సెప్టెంబర్ 1న నిర్వహించే “చలో ఢిల్లీ” కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.ధనుంజయ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కావాలి కొట్రేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర నగర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద కుమార్, రియాజ్, బండారు తేజ, బి కె ఎస్ మండల కార్యదర్శి బండారు లోకేష్, రాయదుర్గం అధ్యక్షులు కుమార్ నాయక్, అశోక్,యువతేజ ,వంశీ ప్రసతదితరులు పాల్గొన్నారు.

# పీవీకేకేలో ఘనంగా ఓరియంటేషన్

**అనంతపురం, ఆగస్టు 13 మనం న్యూస్ :** పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురంలో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్(పరిచయకార్యక్రమం) గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ అవకాశాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతిక విద్యలో క్రమశిక్షణతో కూడిన ప్రామాణిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, అవసరమైన సౌకర్యాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో లభిస్తున్న అవకాశాలనుసద్వినియోగంచేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల



చైర్మన్ డా. కిషోర్ పల్లె మాట్లాడుతూ, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,పరిశ్రమలకుఅవ సరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ప్రత్యేక ప్రణాళికతో ముందుకుసాగుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలనిసూచించారు. కళాశాల కరస్పాండెంట్ డా.పల్లెరఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు బీటెక్ విద్యను కేవలం డిగ్రీగా కాకుండా తమ భవిష్యత్‌కు బలమైన పునాదిగా భావించాలని సూచించారు. మొదటి సంవత్సరం నుంచే సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికికళాశాలయాజ మాన్యం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్‌బాబు, డీన్ డా. సంతోష్ కుమార్ రెడ్డి, ఏవో డా. మనోహర్ రెడ్డి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డా.లక్ష్మీనరసప్ప,ఓఅధ్యాపకులు, సిబ్బంది, 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరిన నూతన విద్యార్థులుపాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

– స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థికలబ్ధి – మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి



**అమరాపురం,ఆగస్టు 13,మనంన్యూస్:** మహిళల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అమరాపురం మాజీ ఎంపీపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సభ్యురాలు శ్రీమతి మీనాక్షి రామిరెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు గొప్ప ఊరటనిస్తోందన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభమై ఉచిత బస్సు ప్రయాణశే విజయవంతమైన విషయం తెల్సిందేనన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం మన ప్రాంతంలోనూ విజయవంతంగా అమలవుతోందని ఆమె తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు మొత్తం 8,456 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ. 160 కోట్ల వరకు ఖర్చు చేస్తోందని ఆమె వెల్లడించారు.ఉచిత బస్ ప్రయాణ ఖర్చులు పూర్తిగా ఆదా అవు తుండటంతో మహిళలు, విద్యార్థినులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. మహిళల ప్రయా ణాన్ని సులభతరంచేసి, వారిఆర్థికభారాన్ని తగ్గిం చడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ సహసోపే నిర్ణయం అభినందనీయమన్నారు.ఈ గొప్ప అవకాశాన్ని మనప్రాంతంలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలనిఆమెకోరారు.ఈపథకాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,కూటమి ప్రభుత్వానికి మాజీఎంపీపీశ్రీమతిమీనాక్షి రామిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

# ఇట్టిన బసవేశ్వర స్వామి ఆలయంలో 17 నుంచి శాశ్వత పూజలు



**బొమ్మనహాల్ ఆగస్టు 13 మనంన్యూస్:** మండల పరిధిలోని బండూరు, దేవగిరి గ్రామాల సమీపంలో గల కొండలో వెలసిన ఇట్టిన బసవేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి శాశ్వతంగా నిత్య పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఇకపై ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బసవేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కుబడులు చెల్లించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ వారసులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 13 మనంన్యూస్ :** 80,వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14 ,వ తేదీ ఉదయం 8:00 గంటలకు అనంతపురంపట్టణంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు నిర్వహించే'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలోప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, పుర ప్రముఖులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, క్రీడాకారులు,విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఓ ఆనంద్ కలెక్టర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలోప్రజలు పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువత,స్వచ్ఛందసేవా సంస్థలు, పాల్గొని పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని మండల , గ్రామ వార్డు స్థాయిలలో తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని మండల స్థాయి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూజాతీయ జెండాలను చేత బూని దేశభక్తిని చాటాలని అలాగే అన్ని వర్గాల ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు. అపార్ట్మెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, షాపులు తదితరప్రాంతాల్లోనిప్రజలు వారి వారి ఆవాసాలపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. దీనికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు జిల్లా కంట్రోల్ రూమ్‌తో పాటు నోడల్ ఆఫీసర్ ఈ-మెయిల్ (అనంతపూర్ . ఏపిటిఏఏ



జిమెయిల్ .కామెంట్ కు పంపాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్ నందు ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా ఆయా కార్యక్రమాలనుపై తెలిపిన విధంగా పంపాల్సి ఉంటుందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు వారి కింది స్థాయి సిబ్బందికి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు తెలియజేసి పలు సూచనలు సలహాలు ఇచ్చి హర్ హర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

# ఏకలవ్య విగ్రహానికి విరాళం



**అనంతపురం, ఆగస్టు 13 మనంన్యూస్ :** అనంతపురం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజనుల ఆరాధ్య దైవం ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు సంబంధించి తన వంతు సహాయంగా రూ, 10వేలు ఏకలవ్య విగ్రహ కమిటీ సభ్యులు సాకే గోవింద్‌కి అందజేసినట్లు శివకుమార్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిఅభివృద్ధి కోసంతనవంతు సహాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటానని గతంలోకూడా ఎంతోమందికిసహాయసహకారాలు అందించిన విషయం మీ అందరికీ తెలిసిందే అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలోగిరిజనప్రజాసంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షులుగర్మామల్లికార్జున నాయక్. ఆల్ ఇండియా ఏరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే చిరంజీవి, ఎరుకలసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పామిడి సాకే గోవిందు, రాజు నాయక్, సంఘం నాయకులు బాబు నాయక్, ప్రసాద్ నాయక్, పాల్గొన్నారు

# అంధకారం తొలగింది.. వీధి దీపాలు వెలిగాయి

**ధర్మవరం, ఆగస్టు 13,మనంన్యూస్ :** మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో కొంతకాలంగా వీధి దీపాలు వెలగక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన వీధుల్లో చీకటి నెలకొనడంతో కాలనీవాసులు, బాటసారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను స్థానిక టీడీపీ నాయకుడు కురబ చంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు.టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుమారు 20 కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. సాంకేతిక సిబ్బంది సహకారంతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో దీపాలను బిగించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో చీకటి తొలగి వెలుగులు నిండాయి.సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయించిన చంద్ర, పరిటాల శ్రీరామ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంపై చంద్రను అభినందించారు. కార్యక్రమంలో బలరాం, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.





# మెడికల్ అడ్మిషన్లలో బీసీలకు ద్రోహం చేసే జీవో నెం.102 ను తక్షణమే రద్దు చేయాలి




- విద్యారంగ సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కూటమి ప్రభుత్వంపై ఉద్యమిస్తాం
- కడప జిల్లా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం నూతన కమిటీ ఎన్నిక
- జిల్లా కన్వీనర్‌గా రామ్ చరణ్ జిల్లా కో కన్వీనర్‌గా యోగానంద

**అనంతపురం, ఆగస్టు 13 మనంన్యూస్ :** కడప నగరంలోని బీసీ భవనంలో బిసివై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కడప జిల్లా నూతన కమిటీని బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా కన్వీనర్ రామ్ చరణ్, జిల్లా కో కన్వీనర్‌గా యోగానందలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలనీ, విద్య హక్కు చట్టాన్ని అమలుచేయాలనీ,సంక్షేమహాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలనీ, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని వారు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడు తున్నారని, ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మాత్రం.. ఈ సమస్యలపై సమీక్ష ఏర్పాటు చేయకుండా సమస్యలను గాలికి వదిలేసాడని వారు మండిపడ్డారు.ఇప్పటికైనా మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నారా లోకేష్‌కిహెచ్చరించారు.విద్యరంగ సమస్యలు పరిష్కరించని ఎడల బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వారు కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేణు, వెంకటరమణ, యూత్ కన్వీనర్ నాగార్జున యాదవ్ వెంకటేశ్వర్లు, పెంచలయ్య, వినోదు, మోక్షిత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్తలు మండల పర్యటన




**చెన్నేకొత్తపల్లి ఆగస్టు 13 మనంన్యూస్ :** ఉమ్మడి అనంతపురం జిల్లా రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నటరాజ్ , భాస్కర్ రావు , లక్ష్మీ కళ్యాణి , లక్ష్మణ్ , వెంకట రమణ , భార్గవ్ రెడ్డి డాక్టర్ల బృందం ఏలినో ప్రభావంతో నెలకొన్న దీర్ఘకాలిక బెట్ట పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత పంటలను తేమ ఒత్తిడి నుండి రక్షించడంతో పాటు రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు , ప్రణాళికను మార్చుకునేలా రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మండల పర్యటన చేశారు. ఇందులో భాగంగా మండలంలోని వెంకటంపల్లి , గంగినేపల్లి , కనుముక్కల , బసంపల్లి గ్రామాలలోని రైతులతో కలసి కంది , వేరుశెనగ పంటలను పరిశీలించి బెట్ట పరిస్థితులలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అందుబాటులో ఉన్న నీటితో రక్షకతడులు ఇవ్వాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. నీటి లభ్యత పరిమితంగా ఉన్న పరిస్థితులలో పంట పరిస్థితిని బట్టి పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాములు ఒక లీటరు నీటికి , 19:19:19 నీటిలో కరిగే ఎరువును 10 గ్రాములు ఒక లీటరు నీటికి, లేదా యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా తాత్కాలికంగా పెట్ట ప్రభావాన్ని తగ్గించవచ్చని రైతులకు సూచించారు. అయితే పంట దశ, నేల పరిస్థితి బట్టి స్థానిక వ్యవసాయ అధికారులసూచనలతోమందులు పిచికారీ చేయాలని సూచించారు. రాబోయే వర్షాల ఆధారంగా ఖాళీగాఉన్నబీడుభూములలో స్వల్పకాలిక చిరుధాన్యాలైన కొర్రలు, సజ్జ, అపరాల పంటలైన ఉలవలు,పెసర,మినుము, అలసంద వంటి పంటలను సాగుచేయాలనివ్యవసాయశాస్త్రవేత్తలు సూచించారు అదేవిధంగా రైతులు పంటల బీమా మరియు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, రైతు సేవ కేంద్రాల సిబ్బంది నాగేశ్వరి, రామ్మోహన్, నాగరాజు, సునీత , ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది హరినాథ్ రెడ్డి , సునీత , శ్యామల మరియు రైతులు పాల్గొన్నారు.



# కమ్ముకున్న మేఘమా...కర్షకునుపై కరుణ లేదా...!

▪ మేఘం కమ్ముకుంది... వాన మాత్రం కురవలేదు..! ▪ ధర్మవరం డివిజన్ పరిధిలోని రామగిరి మండలం కుంటిమెద్దిగ గ్రామంలో



**ధర్మవరం ఆగస్టు 13 మనంన్యూస్ :** నిన్న ఆకాశం ఒక్కసారిగా మేఘాలతో నిండి పోయింది.ఉదయంనుంచే ఎండతీవ్రతతో అల్లాడిన రైతులకు మధ్యాహ్నం సమయంలో నల్లటి మేఘాలు కనిపించడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.పొలాలపైకి భారీగా మేఘాలు కమ్ముకోవడంతోరైతుల్లో వర్షంపై ఆశలు చిగురించాయి.ఆకాశాన్ని చూస్తూ వాన కోసం ఎదురు చూస్తున్న రైతన్నలకుమేఘాల రాక కొంత ఉపశమనాన్ని కలిగించింది.పంటలకు నీరు అందుతుందని,భూమి తడిసి పంటలు పచ్చబడతాయని ఆశించారు.చాలా రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు నల్లటి మేఘాలను చూసి ఆనందంతో ఉప్పొంగిపోయారు."ఈసారి అయినా వర్షం కురుస్తుందేమో"అనే ఆశతో ఆకాశం వైపు ఆశగా చూశారు.కానీ కొద్దిసేపటికే పరిస్థితి మారి పోయింది.మేఘాలు దట్టంగా కమ్ముకున్నప్పటికీ చినుకు కూడా నేలపై పడలేదు.వర్షం వస్తుందని ఆశించిన రైతన్నలకుచివరకు నిరాశే మిగిలింది. ఆకాశమంతా నల్లటి మేఘాలతో నిండినావర్షం మాత్రం కురవకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.పొలాల్లోని పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయి.బోర్లు, చెరువులు కూడా నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నాయి.మేఘాలను చూసి సంతోషించిన రైతన్నవర్షం రాకపోవడంతో నిరాశగా ఇంటి దారి పట్టారు.ఒక్క వాన పడితే పంటలకు ఎంతో మేలు జరుగుతుందనిరైతులు చెబుతున్నారు.వర్షాభావ పరిస్థితులు కొనసాగితే పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందనిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి అనుకూలిస్తేనే తమ కష్టం ఫలిస్తుందనిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటిమెద్దిగ గ్రామంలో నిన్న కనిపించిన ఈ దృశ్యంరైతుల ఆశలు, నిరాశలకు అద్దం పట్టింది.నల్లటి మేఘాలు కమ్ముకున్నాచినుకు జాడ లేకపోవడం

# రీసర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి

– కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

**కళ్యాణదుర్గం , ఆగస్టు 13 మనం న్యూస్ :** రీ-సర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో 6వ దశ కింద చేపట్టిన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు అందాయా లేదా అని రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే ఎంతవరకు జరుగుతుందనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ (గ్రౌండ్ ట్రూథింగ్ ) ప్రక్రియ జరుగుతోందగా, మొత్తం 10,000 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2,700 ఎకరాలలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోజు వారీ లక్ష్యాలను మించి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశితగడువులోగారీసర్వే పూర్తి చేయాలనిఅధికారులనుఆదేశించారు.ఈ కార్యక్రమంలో



సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల తహసిల్దార్ ఆంజనేయప్రసాద్,ఆర్ఎస్‌డిటి,మండల సర్వేయర్, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, పాల్గొన్నారు.

# జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని ఆదేశాలు

– ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్‌లో పనితీరుపై సమీక్ష

**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 13 మనంన్యూస్ :** అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో గురువారం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్ బ్యాక్ కు సంబంధించి క్షేత్రస్థాయి పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి డిఆర్డీఏ పిడి శైలజ, సెర్ప్ స్టేట్ ఆఫీసు నుంచి పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ హనుమ నాయక్, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, తదితరులు హాజరయ్యారు.పెన్షన్ పంపిణీపై ఐవిఆర్ఎస్ ద్వారా చేపడుతున్న ఫీడ్బ్యాక్ కు సంబంధించి విశ్లేషణ మరియు ప్రగతి మెరుగుపరచడం పనితీరుపై సమీక్ష నిర్వహించి,




సంబంధిత అంశాలపై అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను డిఆర్డీఏ పిడి, సెర్ప్ స్టేట్ ఆఫీసు పెన్షన్స్ అడిషనల్ డైరెక్టర్ ఇవ్వడం జరిగింది. జిల్లాలో పెన్షన్స్ పంపిణీ మరింత మెరుగ్గా చేపట్టాలని వారు ఆదేశించారు. ఈ సమావేశంలో పెన్షన్స్ హెచ్.డి డిపిఎం ఎన్.రవీంద్ర బాబు, పెన్షన్స్ఏపీవో అజంతుల్లా, డిప్యూటీ ఎంపీడీవోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పెన్షన్ పంపిణీ అధికారులు, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యుత్ సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్య పరిస్కారం



**తనకల్లు, అగస్ట్13 మనంన్యూస్:** కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ ప్రత్యేక చొరవతో కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.తేదీ 28-07-2026న సి.ఆర్. పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. లోకేశ్వర్ రెడ్డి గారు విద్యుత్ సమస్యను శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శాసనసభ్యుల ఆదేశాల మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి,గురువారం 13-08-2026న ఛార్జ్ చేయడం జరిగింది. దీంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో కీలకమైన ఈ సమస్యను వెంటనే పరిష్కరించిన శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్‌కి కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.అలాగే వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఛార్జ్ చేసిన ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులకు మరియు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు.కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంవైద్యులు మరియు వైద్య సిబ్బంది



# కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

వరి నాట్ల పనుల కోసం మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి విషాదం



**డీ. హీరేహాల్, ఆగస్టు 13 మనంన్యూస్ :** మండలం లోని చెర్లోపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై సతీష్‌రెడ్డి అనే యువ రైతు మృతి చెందాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సతీష్‌రెడ్డికి రెండేళ్ల క్రితం సోమలాపురం గ్రామానికి చెందిన నందినితో వివాహం జరిగింది.గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో వరి నాట్ల పనుల నిమిత్తం పక్క పొలంలో ఉన్న శంకరప్ప పొలానికి మోటార్ ఆన్ చేసేందుకు సతీష్‌రెడ్డి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ ఘటనను గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి సతీష్‌రెడ్డిని కరెంట్ షాక్ నుంచి తప్పించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సతీష్‌రెడ్డి మృతితో చెర్లోపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కల్లుమడిలో ఘనంగా "మన ఇంటికి - మన శ్రావణి" డోర్ టు డోర్ కార్యక్రమం



**సింగనమల ఆగస్టు 13 మనం న్యూస్ :** రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" పేరుతో ఇంటింటికీ కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాల ప్రచారం అనంతపురం జిల్లా; శింగనమల నియోజకవర్గంలోని కల్లుమడి గ్రామంలో "మన ఇంటికి – మన శ్రావణి" డోర్ టు డోర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.గ్రామంలోని ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూనియోజకవర్గ అభివృద్ధికినిరంతరం కృషిచేస్తామనిఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ,కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# 18 నకిలీ బర్త్ సర్టిఫికెట్లు గుర్తింపు

బాధ్యులపై పోలీస్ కేసులకు ఆదేశాలు

**నంబులపూలకుంట ఆగస్టు 13 మనంన్యూస్:** జనన ధ్రువీకరణ పత్రాల వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్,జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిడీఎంహెచ్ఓఫయోజాబేగం ఆదేశాల మేరకు జిల్లా జనన-మరణ నోడల్ అధికారి కళాధర్, డీపీఓ నాగరాజు ఆధ్వర్యంలోజననధ్రువీకరణ పత్రాలనుక్షుణ్ణంగాపరిశీలించారు.సందర్భంగా రికార్డులు,ధ్రువీకరణపత్రాలు,సంబంధిత వివరాలనుపరిశీలించగా 18బర్త్ సర్టిఫికెట్లునకిలీవిగాగుర్తించినట్లుఅధికారులుతెలిపారు.జనన-మరణ నమోదు ప్రక్రియ లో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసు కోవాలనిజిల్లా వైద్యఆరోగ్యశాఖఅధికారి ఆదేశాలుజారీచేసినట్లు జిల్లా జనన-మరణ నోడల్ అధికారికళాధర్ తెలిపారు.నకిలీ సర్టిఫికెట్లతయారీ,జారీకి సంబంధించిబాధ్యులపై పోలీసుకేసులు నమోదుచేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.






# విద్యుత్ బిల్లుకు 'ఆన్‌లైన్' బాట

-ఇక బిల్లు కట్టాలంటే.. పవర్ బిల్ కౌంటర్ బాట కాదు.. సెల్‌ఫోన్ బాటే!
- విద్యుత్ బిల్ వసూలు కౌంటర్లు బంద్.. డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం
-మారుమూల గ్రామాల ప్రజలకు అదనపు ప్రయాణ భారం..
స్మార్ట్‌ఫోన్ లేనివారి పరిస్థితి ఏమిటి...?

**గోరంట్ల, ఆగస్టు 13 మనం న్యూస్:** విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో విద్యుత్ శాఖ కీలక మార్పు తీసుకొచ్చింది. ఇప్పటివరకు సబ్‌స్టేషన్లకు వెళ్లి నేరుగా బిల్లులు చెల్లించే వినియోగదారులకు ఇక ఆ అవకాశం లేకుండా పోయింది. రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్లలో నిర్వహిస్తున్న విద్యుత్ బిల్లు కౌంటర్లను మూసివేసి, బిల్లు చెల్లింపులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.గత మంగళవారం నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినట్లు సమాచారం. దీంతో గృహ, వ్యవసాయ, ఇతర విద్యుత్ వినియోగదారులు ఇక బిల్లులు చెల్లించేందుకు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. మొబైల్ ఫోన్ ద్వారా ఫోన్‌పే తదితర ఆన్‌లైన్ చెల్లింపు విధానాల్లో బిల్లులు చెల్లించడంతోపాటు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా చెల్లింపులు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.ఆన్‌లైన్ చెల్లింపులు సాంకేతికంగా సులభతరమైనప్పటికీ.. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు మాత్రం కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని వారు విద్యుత్ బిల్లు చెల్లించేందుకు గ్రామం నుంచి మండల కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు.గ్రామ, వార్డు సచివాలయంలో బిల్లు చెల్లించాలన్నా.. మారుమూల ప్రాంతాల నుంచి ప్రయాణ ఖర్చులు పెట్టుకుని పట్టణానికి రావాల్సి వస్తుందని, ఇక్కడ బిల్లు ఎక్కడ చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

**బిల్లు ఒకటి.. అదనపు ఛార్జీలు మరొకటి:** నెట్ సెంటర్లు, మీ-సేవా కేంద్రాల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించుకోవాలంటే బిల్లు మొత్తంతో పాటు అదనపు సేవా ఛార్జీలు కూడా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గ్రామం నుంచి పట్టణానికి రావడానికి ఒక ఖర్చు.. బిల్లు చెల్లించేందుకు మరో అదనపు ఛార్జీ.. ఇలా విద్యుత్ బిల్లు చెల్లింపే అదనపు ఆర్థిక భారంగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి కుటుంబంలోనూ స్మార్ట్‌ఫోన్ ఉండటం, ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన ఉండటం సాధ్యం కాదని ప్రజలు అంటున్నారు. స్మార్ట్‌ఫోన్ లేని వృద్ధులు, డిజిటల్ చెల్లింపులు తెలియని వారు బిల్లులు ఎలా చెల్లించాలనే ప్రశ్నను లేవనెత్తుతున్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు లేని పలు వురు వినియోగదారులు విద్యుత్ బిల్లులు వసూలు చేసే కౌంటర్లను ఆశ్రయించేవారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేయడం తెలియని వారికి కొత్త విధానం ఇబ్బందిగా మారే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముందుగా వినియోగదారులకు విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అనం తరం కౌంటర్లను మూసివేసి ఉంటే బాగుండేదని పేర్కొంటున్నారు.ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన వెంటనే చెల్లింపు వివరాలు, రసీదు మొబైల్ ఫోన్‌కు అందడం వల్ల సమయం ఆదా అవుతుందని విద్యుత్ శాఖ భావిస్తోంది. ఈ అంశంపై



గోరంట్ల మండల విద్యుత్ శాఖ ఇంజనీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం వినియోగదారులు ఇక విద్యుత్ బిల్లులు వసూలు చేయు కౌంటర్ కు రావాల్సిన అవసరం లేదని,సచివాలయాల ద్వారా లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించుకోవాలని సూచించారు. కొత్త విధానాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కందికుంట



**కదిరి ఆగస్టు 13 మనం న్యూస్:** కదిరి నియోజకవర్గం లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే నా ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. గురువారం కదిరి మున్సిపల్ పరిధిలోని 34వ వార్డు పార్థసారథి కాలనీ నందు ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పాలన లో 34వ వార్డు పార్థసారథి కాలనీ లో నిర్వహించిన ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పార్థసారథి కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. , కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్లు హుస్సేన్ భాష, ముని, రమణ నాయకులు నరసింహులు, శ్రీరాములు, గంగిశెట్టి, కిష్టప్ప,కూటమి నాయకులు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి కి ఎంపికైన కదిరి విద్యార్థులు

**కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:** అమరావతి ఛాంపియన్ షిప్ -2026 క్రీడా పోటీల్లో కదిరి ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురంలో బసవన్న పల్లి పాఠశాలలో నిర్వహించిన అమరావతి



ఛాంపియన్ షిప్ -2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలలో ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. వివిధ క్రీడా విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు కె భార్గవ్ నాయక్ వాలీబాల్ బి.మహేంద్ర నాయక్ వాలీబాల్ ఈ.హర్ష హరినాయక్ వాలీబాల్ బి.తరుణ్ నాయక్ ఖో ఖో విద్యార్థులు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. అనంతపురం ఆర్డిటి డిస్టిక్ మీట్ సెలక్షన్ వివిధ క్రీడ విభాగాల్లో ఎంపికైన విద్యార్థులు బి.జయ సాగర్ నాయక్ లాంగ్ జంప్- అథ్లెటిక్స్ బి.గోవర్ధన్ నాయక్ 400 మీటర్స్ అథ్లెటిక్స్ ఎం.ప్రశాంత్ నాయక్ షాట్ పుట్ అథ్లెటిక్స్ ఈ.హర్ష హరి నాయక్ 600 మీటర్స్ అథ్లెటిక్స్, పి శివకుమార్ నాయక్ హై జంప్ అథ్లెటిక్స్ ఫిదా పోటీలలో ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ బాయ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉపేంద్ర ,ఉపాధ్యాయులు విద్యార్థులు అందరినీ అభినందించడం జరిగిందనీ . రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించి కదిరి ఏపీ టి డబ్ల్యూఆర్ ఎస్ బాలుర పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులను అభినందించారు.

## చేయూతగా.. కృత్రిమ చేయి

**-ఆగస్టు 30న అనంతపురంలో 'చేయూత' కార్యక్రమం..మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన వారికి ఉచితంగా కృత్రిమ చేతులు**
**- రాయలసీమలోని ఆరు జిల్లాల విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలి**
**- అర్హులు 8866306969కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి**




**పుట్టపర్తి, ఆగస్టు 13 మనం న్యూస్:** మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలిచేందుకు 'చేయూత' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 30న అనంతపురంలో ఉచితంగా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ (పని చేయగలిగే కృత్రిమ చేతులు) పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు చెందిన అర్హులైన విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వావలంబన సాధించాలని కోరారు. కృత్రిమ చేతులు అవసరమైన అర్హులు ముందస్తుగా 8866306969 కాల్ సెంటర్ నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన వారికి సమాచారం చేరేలా అధికారులు సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. చేయి కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులు రోజువారీ పనుల్లో మరింత స్వావలంబన సాధించేందుకు ఉపయోగపడేలా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్ జి.ఎం. సురేష్, కార్యదర్శి జి.బి. విశ్వనాథ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చక్రవర్తి, పి. మల్లికార్జున, టి. సంజీవ్ లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతికి అనుకూలంగా రైతులు పంటలు వేసుకోవాలి

**ఓబులదేవరచెరువు 13 మనంన్యూస్:** ప్రకృతి వ్యవసాయంపై గురువారం మలకవారిపల్లి మరియు తంగేడుకుంట గ్రామాలలో కదిరి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల బృందం రైతులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వలన పంటల సాగు విస్తీర్ణం తగ్గినది. వేసిన పంటలలో బెట్ట పరిస్థితుల నుండి కాపాడుకోవడానికి పోషకాలతో పాటు నీటిని పిచికారీ చేయాలి దీని కోసం 19:19:19 పొటాషియం నైట్రేట్ 5-10 గ్రాములు లీటర్ నీటికి లేదా యూరియా 20 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేస్తే 10-15 రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చు. రాబోయే రోజుల్లో వర్షాలు పడినపుడు ప్రత్యామ్నాయ పంటలైన సజ్జ కొర్ర కంది పెసర మరియు ఉలవ వంటి పంటలను సాగు చేసుకోవడం వలన దిగుబడి వస్తుంది. నీటి సంరక్షణ చర్యలు లోతైన దుక్కులు కాలవలు తీసుకోవడం చేయాలి. బెట్ట పరిస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందని వీటి నివారణకు ఇమిడక్లోప్రిడ్ 80ఎమ్.ఎల్/ఎకరా చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు.కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిరణ్ కుమార్, రమేష్ నాయక్, తాసిల్దార్ శ్రీనివాసులు రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్, సహాయ వ్యవసాయ అధికారి వెంకటేష్ , సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనాల కోసం కర్షకయాప్

**- ఆధునిక సాంకేతికతతో వ్యవసాయానికి కొత్త దిశ -ఎమ్మెల్యే కందికుంట**

**కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:** కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న వాయిస్ ఆఫ్ సిటిజన్ కార్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగిస్తూ రైతుల ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురానున్న కర్షక యాప్‌పై గురువారం కదిరి నియోజక వర్గం లోని అన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని కర్షక యాప్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, పంటలకు వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించడం, పంట నష్టాలను నివారించేందుకు అవసరమైన సూచనలు అందించడం, పంట దిగుబడిని పెంచే విధంగా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ఆధునిక సాంకేతికతతో కదిరి రైతాంగానికి అండగా నిలుస్తామని ఆయన తెలిపారు.



# నేతన్న సేవలో.. అనర్హుల జాతర..!

– మగ్గం లేనివారికి 'నేతన్న' వరం..
మగ్గం ఉన్నవారికి మొండి చేయి!
– ఆటో డ్రైవర్ల నుంచి ప్రైవేటు ఉద్యోగుల వరకు..
'నాలుగో స్తంభం' ప్రతినిధుల పేర్లు ఉన్నాయా.?



చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకం జిల్లాలో కొందరి నిర్లక్ష్యం కారణంగా పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందించాల్సిన పథకంలో.. అసలైన నేతన్నలు పక్కన పడుతుండగా, చేనేత వృత్తితో సంబంధం లేని వ్యక్తులకు సైతం లబ్ది చేకూరుతోందన్న విమర్శలు అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నాయి. 14 వేల దరఖాస్తులు.. 12,750 మంది అర్హులు. జిల్లాలో నేతన్న సేవలో పథకానికి సుమారు 14 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. 12, 750 మందిని అర్హులుగా గుర్తించారు. పలు దశల్లో దరఖాస్తులను వడపోసి అనర్హులను తొలగించినట్లు చెబుతున్నప్పటికీ.. తుది అర్హుల జాబితాలో చేనేత మగ్గంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల పేర్లు కనిపించడం విస్మయానికి గురిచేస్తోంది. అర్హుల జాబితాలో ఆటో డ్రైవర్లు, ప్రైవేటు ఉద్యోగులు, మద్యం దుకాణాల్లో పనిచేసేవారు, చికెన్ షాపుల నిర్వాహకులు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు సమాజానికి సమాచారం అందించే 'నాలుగో స్తంభం'గా చెప్పుకునే మీడియా రంగానికి చెందిన వ్యక్తుల పేర్లు కూడా జాబితాలో చోటుచేసు కున్నాయన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. చేనేత మగ్గం ఉన్నదా? వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీ లించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా.. ఇలాంటి పేర్లు జాబితాలోకి ఎలా వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఒకవైపు మగ్గం లేని వారికి పథకం అందుతుందన్న ఆరోపణలు.. మరోవైపు దశాబ్దాలుగా మగ్గం నేస్తున్న అసలైన నేతన్నలకు సాయం అందలేదన్న ఆవేదనలు.. పథకం అమలులో లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. పెనుగొండ నియోజకవర్గం లోని ఒక మండలంలో మగ్గాల సంఖ్య వందలోపే ఉన్నప్పటికీ.. 93 మందిని అర్హుల జాబితాలో చేర్చడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ జాబితాలో అర్హత లేని వ్యక్తులకు చోటు దక్కిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలికి పథకానికి అవసరమైన అర్హతలు లేకపోయినా.. జాబితాలో 81వ సీరియల్ నంబర్‌లో ఆమె పేరు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే మండలంలో ఒక కాలనీకి ఒక వ్యక్తి కి నాలుగు పవర్‌లూమ్స్ పరిశ్రమ నిర్వహిస్తున్నప్పటికీ.. నిబంధనల ప్రకారం అనర్హుడిగా ఉండాల్సిన ఆయన పేరు కూడా అర్హుల జాబితాలో కనిపిస్తోందన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. అర్హుల ఎంపికలో అధికారిక నిబంధనలు పక్కనపడ్డాయా? లేక కొందరి సిఫార్సులు, రాజకీయ పలుకుబడి పనిచేసిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా..? ప్రజాప్రతినిధుల ప్రోద్బలమా..? రాజకీయ పలుకుబడా..? అన్నది సమగ్ర విచారణతో తేల్చాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పేద చేనేత కుటుంబాలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో పథకాన్ని తీసుకొస్తే.. క్షేత్రస్థాయిలో ఎంపికలో లోపాలు చోటుచేసుకుంటే అసలు లబ్దిదారుల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్న తలెత్తుతోంది. "అర్హత ఉన్నా సాయం రాలేదు.." అని పలువురు చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోరంట్ల ఒకటో వార్డుకు చెందిన శ్రీనివాసులు తాను సుమారు 50 ఏళ్లుగా మగ్గం నేస్తున్నానని, గతంలో పథకం ద్వారా లబ్ది పొందానని.. ఈసారి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సాయం ఎందుకు రాలేదో అర్థం కావడం లేదని వాపోయారు. అదేవిధంగా గోరంట్ల పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ, భాస్కర్ నాయక్ సావిత్రి భాయ్ కూడా అర్హత ఉన్నా కూడా నేతన్న ఆర్థిక సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పథకం ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. అమలులో లోపాలు, అనర్హుల ఎంపిక, అర్హుల విస్మరణ వంటి ఆరోపణలు కొనసాగితే చివరకు నష్టపోయేది అసలైన నేతన్నలే. అంతేకాకుండా ప్రభుత్వ సదుద్దేశంతో అమలు చేస్తున్న పథకానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అనర్హులకు అందిన లబ్దిని గుర్తించి.. అర్హతలను పునఃపరిశీలించి.. నిజమైన చేనేత కుటుంబాలకు మాత్రమే ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.





- అర్హుల జాబితాలోకి అనర్హులు ఎలా వచ్చారు?
- నిజమైన నేతన్నలు ఎందుకు మిగిలిపోయారు?
- ఎవరి సిఫార్సులతో పేర్లు చేరాయి?
- తప్పిదాలకు బాధ్యులెవరు?
- విచారణలో ఈ ప్రశ్నలకు సమాధానాలు బయటపడాల్సి ఉంది.

– పుట్టపర్తి ఆగస్టు 13 మనం న్యూస్

## బి. పప్పూరు ఆసుపత్రిలో తిరంగా ర్యాలీ



నార్పల ఆగస్టు 13 మనం న్యూస్ : మండలం పరిధిలోని బి.పప్పూరు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ హాజీరా ఆధ్వర్యంలో తిరంగా జండా ర్యాలీని నిర్వహించారు. దేశ స్వాతంత్ర 80 వ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ స్వాతంత్రం వచ్చిన సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలని జాతీయ భావం పెంపొందాలని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పామిడిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పామిడి ఆగస్టు 13 మనం న్యూస్ : స్థానిక పట్టణంలోని ,టి సీ,ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నుండి మొదలుకొని. భారతీయ జనతా పార్టీ పెద్దల ఆధ్వర్యంలో పట్టణంలోని. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులు కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 2,500 మంది విద్యార్థుల పాల్గొని వారి చేతుల్లో త్రివర్ణ పతాకాలను ధరించి దేశభక్తి, నీ జాతీయ సమైక్యతను చాటారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలతో భారీ త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని బి సీ సి రోడ్డు లో ప్రదర్శన, చేశారు, ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ జెండా భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తిని చాటాలని, యువత లో జాతీయ భావాలను మరింత తగా పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ ఐక్యత, దేశం పట్ల బాధ్యత భావనలు మరింత బల పడాలని ఆకాంక్షించారు. వేలాది మంది విద్యార్థులు ఒకే వేదికపై త్రివర్ణ పతాకాలతో పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, మల్లికార్జున ఆచారి కుమారస్వామి సుందరయ్య రామ్ నరేష్ కార్యకర్తలు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మహిళా సంఘాల సీసీలు యానిమేటర్లు మహిళలు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, గుంతకల్ మాజీ శాసనసభ్యులు మధుసూదన్ గుప్తా, రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాస్ ,తహసీల్దార్ షర్మిల, ఎంఇఓ జయ నాయక్, ఎంపిడిఓ ప్రభాకర్ నాయక్ ,ఏపిఓ నల్లప్ప ,అనం తపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి శ్రీమతి కవిత శర్మ , పామిడి మండల ఇన్‌చార్జ్ డాక్టర్ పోగుల నాగేంద్ర బాబు , చౌహాన్ అంజి నాయక్ , శ్రీ రాజశేఖర్, జోజోడీ కుమార్ పట్ర శ్రీనివాసులు దుస్తాకర్ పవన్ , బెస్త నాగేంద్ర పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు... ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

**గుత్తి ఆగస్టు 13 మనం న్యూస్ :** గుత్తి అనంతపురం గ్రామ పరిధిలోగల 44వ నెంబర్ జాతీయ రహదారిలో గుత్తి పట్టణంలో నుండి 44వ నెంబర్ జాతీయ రహదారిలోకి ప్రవేశించే కూడలి వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ఘటనలో మామిడి గ్రామానికి చెందిన సీనప్ప ప్రమాద స్థలంలోనే మృతి చెందగా యోగేశ్వరప్పకు తీవ్ర గాయాలు అయ్యాయి. మామిడూరు గ్రామానికి చెందిన సీనప్ప యోగేశ్వర పలు గుత్తి పట్టణంలో తమ వ్యక్తిగత పనులు ముగించుకొని తమ స్వగ్రామానికి వెళ్లే క్రమంలో గుత్తి పట్టణంలో నుండి 44 నెంబర్ జాతీయ రహదారులకు ప్రవేశించే క్రమంలో హైదరాబాదు నుండి బెంగళూరు వైపు వెళ్తున్న కంటైనర్ ఢీకొన్నది ఈ ప్రమాదకతలలో సీనప్ప( 40) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా యోగేశ్వరప్ప కు తీవ్ర గాయాలు అయ్యాయి శతకాత్రున్ని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించినట్లు తెలుస్తోంది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలు శిక్ష

– రూరల్ అప్గ్రేడ్ సిఐ జి. నిరంజన్ రెడ్డి

**కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, కదిరి డీఎస్పీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా, కదిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన జగదీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి నట్లు రూరల్ అప్గ్రేడ్ సిఐ జి నిరంజన్ రెడ్డి ప్రకటనలోతెలిపారు. ఈ కేసులో సమర్పించిన ఆధారాలు , వాస్తవాలను పరిశీలించిన , కదిరి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి 7 రోజుల జైలు శిక్ష విధించి నట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టేందుకు కదిరి రూరల్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తున్నారని. మద్యం సేవించి వాహనం నడపకుండా, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు ఆయన తెలియజేశారు.

## రేపు ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి పురం పర్యటన



హిందూపురం మనంన్యూస్: స్థానిక శాసన సభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి ఆగస్టు నెల 15 న శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు పూజలు చేయనున్నారు. శనివారం ఉదయం 7 గంటలకు హిందూపురం పట్టణం బాలాజీ సర్కిల్ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. ఉ .8 : 30 గంటలకు హిందూపురం పట్టణం డిబీ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్క్ ను ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే నివాసం వద్ద 8 మంది దివ్యాంగులకు 3 చక్రాల స్కూటీ లు పంపిణీ చేస్తారు. ఉ 10:45 గంటలకు లేపాక్షి మండలం పులమతిలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం. చేస్తారు. మ.12 : 00 గంటలకు చిలమత్తూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల హాస్టల్ ను ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## వివాహానికి గుత్తి విలేకరులను ఆహ్వానించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి ఆగస్టు 13( మనం న్యూస్ ):** గుత్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయం నందు గుంతకల్ శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి,పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈ నెల 30వ తారీకున జరగబోయే తన సోదరి వివాహానికి కుటుంబ సమేతంగా తప్పక హాజరుకావాలని గురువారం గుత్తి పట్టణ మరియు మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులను మర్యాదపూర్వకంగా కలిసి శుభలేఖలు అందించి వారిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, గుత్తి టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె చౌదరి, గుత్తి, ఆసుపత్రి కమిటీ సభ్యులు ఎర్రగుడి రమేష్,చికెన్ శీన, టిడిపి నాయకులు కోనంకి కృష్ణయ్య, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలను బలోపేతం చేయడమే జ్ఞానజ్యోతి లక్ష్యం

– సూపర్వైజర్ గంగాదేవి

**అమడగూరు ఆగస్టు 13.మనం న్యూస్ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న మూడో.రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా గురువారం మూడో. రోజు శిక్షణ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించి, చిన్నారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే ఈ శిక్షణా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సూపర్వైజర్ గంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ గంగాదేవి.మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని అన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి వెలికితీయడంపై కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు వయస్సుకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడం, ఆటలు, అభ్యాస కార్యక్రమాల ద్వారా వారి ఆసక్తిని పెంచడం వంటి అంశాలను శిక్షణలో వివరించినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ తమ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. చిన్నారుల విద్యతో పాటు ఆరోగ్యం, పోషణ, మానసిక వికాసంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ చిన్నారుల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేయడంలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.శిక్షణా కార్యక్రమంలో ఎంఈఓ 1.జిలాన్ బాషా 2 సంపూర్ణ.సూపర్వైజర్ గంగాదేవి.టీచర్లు ధనంజయ సంతోష్ కుమార్ శ్రీనివాసులు.అంగన్వాడీ కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రాయోగిక పద్ధతుల్లో వివరిస్తూ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సీడీపీవో రెడ్డి రవణమ్మ.శిక్షణ కేంద్రాన్ని పర్యవేక్షించారు. శిక్షణా కార్యక్రమం నిర్వహణ, కార్యకర్తల పాల్గొనడం, వారికి అందిస్తున్న అంశాలను ఆమె పరిశీలించారు. మూడో రోజు కూడా అంగన్వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు.



## బ్యాంకర్ల సమన్వయంతో లక్ష్యాల సాధన



- రుణ ప్రణాళిక లక్ష్యాలు వంద శాతం సాధించాలి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..
- ఎన్ పి ఏ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సకాలంలో రుణాలు.. వేగంగా డిపాజిట్ల సమీకరణ..
- రూ.22,658 కోట్ల రుణాలు.. రూ.12,193 కోట్ల డిపాజిట్లు

**పుట్టపర్తి, ఆగస్టు 13 మనం న్యూస్ :** బ్యాంకర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి త్రైమాసిక డిసిసి, బిడి ఎల్ ఆర్ సి సమావేశంలో జిల్లాలో బ్యాంకింగ్ ప్రగతి, ప్రభుత్వ సంక్షేమ--అభివృద్ధి పథకాల అమలుపై సమీక్షించారు.తొలి త్రైమాసికంలో జిల్లాలో రూ.12,193.67 కోట్ల డిపాజిట్లు, రూ.22,658.34 కోట్ల రుణాలు ఉన్నట్లు ఎల్డిఎం ఫణీంద్ర కుమార్ వెల్లడించారు. క్రాప్ ఇన్సూరెన్స్, వ్యవసాయ రుణాల మంజూరులో పురోగతి సాధించినట్లు తెలిపారు. పీఎం సూర్యఘర్, పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకుల్లో ఎన్పీఏ శాతాన్ని తగ్గించేందుకు డి ఆర్ డి ఏ ఎం ఈ పి ఎం ఏ , వ్యవసాయ శాఖలు బ్యాంకర్లకు సహకరించాలని ఆదేశించారు. ఎస్ హెచ్ జి ల రుణాల్లో ఎన్ పి ఏ తగ్గించేందుకు గ్రూప్ లీడర్లు, యూనియన్లు, సీసీ లు సహకరించాలన్నారు.రుణాల మంజూరులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బ్యాంకింగ్ డిపాజిట్లను వేగంగా సమీకరించాలని కలెక్టర్ సూచించారు.

## వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా భారీ



**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 13:** జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డా .ఫైరోజా బేగం ఆదేశానుసారం డిప్యూటీ డి.యం -- హెచ్. వో. డా మంజువాణి, డీపీఎంవో డా. జయం పద్మజ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తి, ప్రజాసేవ, ఆరోగ్య అవగాహనకు ప్రజల్లో ప్రతి చేతిలో జండా, ప్రతి గుండెలో దేశభక్తి ఉండాలని అడగడుగునా దేశభక్తి నినాదాలతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు హిందూపురం పట్టణ, గ్రామీణ ప్రాంతాల వైద్య ఆరోగ్య సిబ్బందితో జాతీయ జెండా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో దేశభక్తి భావాన్ని ఆరోగ్య అవగాహనను పెంపొందించ్చేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జండాను చేతబూని నిర్వహించిన ర్యాలీలో "దేశసేవే-ప్రజాసేవ," ఆరోగ్య భారతమే - అభివృద్ధి భారతమని, కరుణ మనబలం - సేవ మనధర్మమని, ప్రజా ఆరోగ్యమే దేశం అభివృద్ధికి ఆధారమంటూ నినదిస్తూ ప్రజల్లో స్ఫూర్తిని నింపారు.ఈ సందర్భంగా డా.పద్మజ మాట్లాడుతూ స్వాత్రంత్రం అనేది ఒక వేడుకగా జరుపుకోవడం మాత్రమే కాకుండా దేశం, సమాజం పట్ల మన భాద్యతలను గుర్తు చేసుకొనే సందర్భమని,ప్రజా రోగ్యంలో ఆరోగ్యశాఖ అందిస్తున్న సేవలు దేశనిర్మాణములో కీలకమన్నారు. ఆరోగ్యవంతమైన ప్రజలే బలమైన దేశానికి పునదిగా ఆమె అభివర్ణించారు. ర్యాలీ అనంతరం ఆరోగ్య సిబ్బంది దేశాసమగ్రత, ఆరోగ్య పరిరక్షణకు, భాద్యతయుతమైన పౌరసత్వం పట్ల ప్రతిజ్ఞచేశారు.ఈ కార్యక్రమం మొత్తం క్రమశిక్షణ, దేశభక్తి మరియు స్వాతంత్ర స్ఫూర్తితో కొనసాగింది .కార్యక్రమంలోవైద్యులు సర్వశ్రీ జయంత్, వహీద్, ఉషారాణి, శాంతా, హిమబిందు,ఆరోగ్య సిబ్బంది మల్లప్ప. ముస్తఫా, వాసు మధ్యస్థ, రమేష్, నరసింహులు, నాగరాజు, సాయి, సురేష్ శేఖర్, భాస్కర్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

## అవయవదాతల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**- జీవన్దాన్ చేసిన కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి**

**- అవయవదాత నవీన్కు ఘన నివాళి --- ప్రభుత్వానికి పలు డిమాండ్లతో తహసీల్దార్కు వినతి**

**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 13:** అవయవదాతల కుటుంబాలను ప్రభుత్వం గౌరవించడంతో పాటు వారికి అండగా నిలవాలని శరీర, అవయవ దాతల సంఘం కన్వీనర్ ఎన్. రాజశేఖర్రెడ్డి కోరారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురంలోని ఎన్జీవో హోమ్లో శరీర, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల బ్రెయిన్డెడ్కు గురై జీవన్దాన్ చేసిన నవీన్కు కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామాలక్ష్మి చేసిన సుదీర్ఘ విజ్ఞప్తుల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నం.95ను 08-08-2024న విడుదల చేసిందని రాజశేఖర్రెడ్డి తెలిపారు. జీవన్దాన్ చేసిన వ్యక్తి అంత్యక్రియల కోసం కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం, ఆర్డీఓ స్థాయి అధికారి ద్వారా ప్రశంసాపత్రం అందజేయడం, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం వంటి అంశాలు జీవోలో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

**అవయవదాత కుటుంబాలకు అండగా నిలవాలి:** నిరుపేద కుటుంబాలే ఎక్కువగా అవయవదానానికి ముందుకు వస్తున్న నేపథ్యంలో, దాతల కుటుంబాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని సమావేశంలో వక్తలు కోరారు. అవయవదాత కుటుంబాల్లో ఒకరికి అవుట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగం క ల్పించాలని, తక్షణ ఆర్థిక సహాయాన్ని రూ. లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. జీవన్దాన్ చేసిన నవీన్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతూ హిందూపురం తహసీల్దార్ వెంకటేష్కు వినతిపత్రం అందజేశారు.

**పాఠ్యాంశాల్లో అవయవదానంపై అవగాహన:** పాఠశాలలు, వైద్య కళాశాలల్లో అవయవదానం, శరీరదానంపై అవగాహన కల్పించే అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని రాజశేఖర్రెడ్డి కోరారు. అన్ని ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో జీవన్దాన్, నాట్టో వెబ్సైట్లు, సంబంధిత కోఆర్డినేటర్ల ఫోన్ నంబర్లతో కూడిన అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కిడ్నీ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని, నిబంధనలు ఉల్లంఘించే కార్పొరేట్ ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం అవయవదాతలకు కల్పిస్తున్న 42 రోజుల సెలవు సౌకర్యాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**సేవా కార్యక్రమాలపై చైతన్యం అవసరం:** రక్తదానం, నేత్రదానం, అవయవదానం, శరీరదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సమాజ సేవకులు, వైద్యులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్లు డి.సి. వెంకటరమణ, బి. వెంకటరమణ, జిల్లా రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, రక్తదాత ఉమర్ ఫరూఖ్, ప్రముఖ కవి చిదంబరరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, కార్మిక నాయకుడు రవికుమార్, విద్యార్థి సంఘం నాయకుడు నరసింహమూర్తి, రంగనాయకులు, బాలవికాస వేదిక కీర్తి, శ్రీనివాస్మూర్తి ఫౌండేషన్ జయంతి, లేపాక్షి నళినాక్షి, జనసేన నిమ్మకాయల రాము, ఉపాధ్యాయ సంఘ నాయకుడు గురురాజారావు, జనవిజ్ఞాన వేదిక రామకృష్ణ, లక్ష్మీపతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.





# పదవీ విరమణ వయస్సు పెంపు పట్ల వెలుగు ఉద్యోగులహర్షం

**– బిసీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే కందికుంట, ఉద్యోగులు**






కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్: కదిరిలో పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు సెర్ప్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు జీతాల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెలుగు ఉద్యోగులు కలిసి పాలాభిషేకం చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికగా వెలుగు సెర్ప్ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన తెలిపారు. పేదరిక నిర్మూలన, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం వెలుగు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని, వెలుగు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో పాటు జీతాల పెంపు నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారనీ. ఈ నిర్ణయం ఉద్యోగులకు మరింత భరోసా, ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. సెర్ప్ సంస్థకు 'వెలుగు'గా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఎంతో గొప్పదని వెలుగు సంస్థ అధికారులు, ఉద్యోగులు పేర్కొన్నారు. వెలుగు సంస్థ, ఉద్యోగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు హర్షం వ్యక్తం చేశారు.

# వైయస్సార్సీపి కార్యకర్త శంకర్ మృతదేహానికి నివాళులు

**–గాయపడిన మాజీ ఉప సర్పంచ్ రాజారెడ్డిని పరామర్శ**
**– మాజీ మంత్రి మాల గుండ్ల శంకర్ నారాయణ**



**గోరంట్ల, ఆగస్టు 13 మనం న్యూస్ :** కర్ణాటక రాష్ట్రంలోని హావేరి పట్టణం సమీపంలో 48వ నంబర్ జాతీయ రహదారిపై మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోరంట్ల మండలం జీనంవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు శంకర్ మృతదేహానికి మాజీ మంత్రి, ఆ పార్టీ నాయకుడు మాలగుండ్ల శంకరనారాయణ గురువారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పులేరు పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు సోదరుడైన శంకర్ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం పట్ల మాజీ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అదే ప్రమాదంలో గోరంట్ల మాజీ ఉపసర్పంచ్ రాజారెడ్డికి గాయాలయ్యాయి. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాజారెడ్డిని మాజీ మంత్రి శంకరనారాయణ గోరంట్ల పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా రాజారెడ్డిని పరామర్శించారు.

# గంగమ్మ గుడికి రూ. 1లక్ష విరాళం అందించిన ఎమ్మెల్యే కందికుంట



**కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:** మండలంలోని బూరుగుపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి గ్రామ గంగమ్మ గుడి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం రూ. 1, లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచన మేరకు ఈ విరాళాన్ని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది రెడ్డి భాష చేతుల మీదుగా గ్రామ నాయకులకు అందించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ఆలయ అభివృద్ధికి సహకరించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి భాషా తో పాటు బూరుగుపల్లి మాజీ సర్పంచ్ ఆంజనేయులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా వ్యాప్తిపై ఆందోళన...

**– పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణం**
**–సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్**





**శింగనమల ఆగస్టు 13 మనంన్యూస్:** మండల వ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నా పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమల వృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడు తోందన్నారు. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపో వడం, రహదారులు, నివాస ప్రాంతాల పరిసరా ల్లో పారిశుద్ధ్య లోపాలు నెలకొనడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొ న్నారు. ముఖ్యంగా వర్షపునీరు నిలిచే ప్రాంతాల్లో దోమల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని, దీంతో ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్ల తాగునీటి నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన పారిశుద్ధ్య సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని కోరారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరిచి, గ్రామాల్లో పారిశు ద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దీనికి బాధ్యత ఎవరిదని సిపిఐ మధు యాదవ్ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, దోమల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.





# టిడిపి నాయకుని భౌతికాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కందికుంట

**కదిరి రూరల్ ఆగస్టు 13 మనం న్యూస్:** టీడీపీ సీనియర్ నాయకులు కరమర్ల నారాయణ ఆచారి గురువారం మృతి చెందడంతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కదిరి పట్టణానికి చెందిన , 4వ వార్డు బూత్ ఇంచార్జ్ కరమర్ల నారాయణ ఆచారి శివైక్యం చెందారనీ. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నారాయణ ఆచారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తో పాటు పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**నల్లచెరువు ఆగస్ట్ 13 మనంన్యూస్:** మండలంలోని బురుజు గంగమ్మ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా సిహెచ్ఓ రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థుల ఎత్తు, బరువు,రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పరిశీలించారు. వయసుకు అనుగుణంగా పిల్లల్లో శారీరక, మానసిక మార్పులను గుర్తించడంతో పాటు శారీరక, మానసిక రుగ్మతలు, కంటి సమస్యలు, నులిపురుగుల సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతులను శుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు దోమతెరలు వినియోగించాలని సూచించారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నస్రీన్, ఆశా కార్యకర్త ఖాదర్‌బీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీకి అందరూ తగిలి రండి

**– ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి**


**నల్లచెరువు ఆగస్ట్ 13 మనం న్యూస్:** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నల్లచెరువులో శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, తహసీల్దార్,మండల విద్యాశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభమై బస్టాండ్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను చాటిచెప్పేలా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్లచెరువు ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాత్రికేయులు, యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండలస్థాయి అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

**– ఎంఈఓ నరసింహ రాజు, శివప్రసాద్**

**సింగనమల ఆగస్టు 13 మనం న్యూస్:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంఈఓ లో నరసింహారాజు శివప్రసాద్ మాట్లాడుతూ సింగనమల మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. చిన్నారుల్లో శారీరక, మానసిక, సామాజిక, భాషా మరియు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా అంగన్వాడీకేంద్రాల్లోకార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు క్రమం తప్పకుండా కేంద్రాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే చిన్నారులను పాఠశాల విద్యకు సిద్ధం చేసే విధంగా ఆటలు, పాటలు, కథలు, చిత్రాలు, వివిధ అభ్యాస కార్యక్రమాల ద్వారా ఆసక్తిని పెంచాలని పేర్కొన్నారు. చిన్నారుల ప్రాథమిక దశలోనే మంచి అభ్యసన పునాదులు ఏర్పడేలా అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని అధికారులు కోరారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో ఆచరణలో పెట్టి చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ పి లు శ్రీనివాసులు పరశురాముడు రామ్ మూర్తి అంగన్వాడి సూపర్వైజర్లు కల్పన నేతాజీ అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.








**పుట్టపర్తి, ఆగస్టు 13 మనం న్యూస్:** దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సార్వభౌమత్వంపై ప్రజల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. సత్యమ్మ ఆలయం నుంచి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా కొనసాగింది.జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఆర్డీఓ సువర్ణతో పాటు జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకున్న చిన్నారులు, విద్యార్థులు 'వందే మాతరం', 'భారత్ మాతాకీ జై' అంటూ నినదించడంతో పుట్టపర్తి ప్రధాన వీధులు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి.

**ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తి, జాతీయ ఐక్యత, దేశ సమగ్రతపై ప్రజల్లో అవగాహన మరింత పెంపొందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం అధికారులు, సిబ్బంది,



విద్యార్థులు, చిన్నారులు కలిసి 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞ స్వీకరించారు. జాతీయ పతాక గౌరవాన్ని కాపాడుతూ దేశ ఐక్యత, సమగ్రతను పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ర్యాలీతో పుట్టపర్తిలో జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది. 'ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం -- ప్రతి హృదయంలో దేశభక్తి' అనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది.

**– దేశభక్తి నినాదాలతో మార్మోగిన పుట్టపర్తి వీధులు..'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో కదిలిన జాతీయ స్ఫూర్తి**
**–చిన్నారుల చేతుల్లో జెండాలు.. నోట దేశభక్తి నినాదాలు.కలెక్టర్, ఎస్పీతో కలిసి అడుగేసిన అధికారులు, విద్యార్థులు**
**–'వందే మాతరం'.. 'భారత్ మాతాకీ జై'తో హోరెత్తిన ప్రధాన వీధులు...ప్రతి ఇంటా త్రివర్ణం.. ప్రతి హృదయంలో దేశభక్తి!**




## పెన్షన్ల పంపిణీపై సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ సమీక్ష

–అర్హులందరికీ ఇంటివద్దే.. పారదర్శకంగా పెన్షన్లు!
–పెన్షన్ల పంపిణీలో అవినీతికి తావులేకుండా చర్యలు..
– నెట్‌వర్క్ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి
– క్షేత్రస్థాయి స్పందనపై అధికారులతో సమీక్ష
– పెన్షన్ల పంపిణీ తీరును పరిశీలించిన సెర్ప్ ఏడి




**పుట్టపర్తి, ఆగస్టు 13 మనం న్యూస్ :** జిల్లాలో పెన్షన్ల పంపిణీ తీరుతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజల స్పందనపై సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి సమీక్షించారు. గురువారం స్థానిక డి ఆర్ డి ఏ కార్యాలయంలో ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో పెన్షన్ల పంపిణీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి అవినీతికి తావులేకుండా ఇంటివద్దనే పారదర్శకంగా పెన్షన్లు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని సచివాలయాల పరిధిలో ఎదురవుతున్న నెట్‌వర్క్ సమస్యలను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ విధానాన్ని ఏపీవో వివరించారు. సమావేశంలో డి ఆర్ డి ఎ పి డి నరసయ్య, జి ఎస్ డబ్ల్యూ ఎస్ నోడల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, డిడిఓ నరేష్ కృష్ణ, ఏపీవో శివమ్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ వినియోగదారుల సదస్సుకు జాయింట్ కలెక్టర్‌ను ఆహ్వానించిన వినియోగదారుల సంఘాల సమాఖ్య

**పుట్టపర్తి ఆగస్టు 13 మనం న్యూస్ :** సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఐఏఎస్‌ను రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి సదస్సు ఆహ్వాన పత్రికను అందజేశారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య, జాతీయ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డిని కూడా సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వినియోగదారుల సదస్సుకు పౌర సరఫరాల శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిపిపిసిఓ చైర్మన్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, నాణ్యత ప్రమాణాలు, వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ అన్నదాత రామిరెడ్డి, సిపిపిసిఓ సభ్యులు చిన్నతంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పళ్లెం జనార్ధన్, ధర్మవరం మండల జనరల్ సెక్రటరీ గుర్రం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు యజ్జన్న, బుక్కపట్నం మండల అధ్యక్షులు ఎం. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, సభ్యులు ఆవుల విష్ణు, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## గోల్‌మాల్' వార్తపై అధికారుల స్పందన..

**–జాబ్‌కార్డులు, బిల్లులపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చు**
**–మేట్ రూ.200 డిమాండ్ చేస్తే చర్యలు తప్పవు.. అధికారుల స్పష్టీకరణ**

**గోరంట్ల ఆగస్టు 13 మనం న్యూస్ :** 'వికసిత్ భారత్.. ఉపాధి హామీలో గోల్‌మాల్..!' శీర్షికన బుధవారం "మనం "దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఉపాధి హామీ శాఖ అధికారులు స్పందించారు. కథనంలో ప్రస్తావించిన ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్ గ్రామానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు పొందేందుకు ఎవరూ దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, జాబ్‌కార్డు కావాల్సిన వారు నేరుగా సంబంధిత కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని అధికారులు సూచించారు. అలాగే పనులు, బిల్లులు, చెల్లింపులకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇక మేట్‌లు కూలీల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు స్పందించారు. గ్రామాల్లో ఎవరైనా మేట్ రూ.200 చొప్పున డిమాండ్ చేస్తున్నట్లు తేలినా, అలాంటి విషయాన్ని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫిర్యాదు అందితే విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

**కూలీలకు అందుబాటులో అధికారులు**


వికసిత్ భారత్.. ఉపాధి హామీలో గోల్‌మాల్...!

ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి కూలీకి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. జాబ్‌కార్డుల నుంచి బిల్లుల వరకు ఎక్కడైనా సమస్య ఎదురైతే నేరుగా అధికారులను సంప్రదించాలని సూచించారు. దీంతో నిన్నటి కథనంలో వెలుగుచూసిన ఆరోపణలపై అధికారుల స్పందన ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది.



## రీసర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి

**– జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**
**– కళ్యాణదుర్గం మండలం గొల్ల గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్**

**కళ్యాణదుర్గం , ఆగస్టు 13 : మనం న్యూస్ :** రీ–సర్వే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కళ్యాణదుర్గం మండలం గొల్ల గ్రామంలో 6వ దశ కింద చేపట్టిన రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీ–సర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు అందాయా లేదా అని రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సర్వే ఎంతవరకు జరుగుతుందనే వివరాలను ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో గ్రౌండ్ ట్రూథింగ్ (గ్రౌండ్ ట్రూథింగ్ ) ప్రక్రియ జరుగుతోండగా, మొత్తం 10,000 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2,700 ఎకరాలలో రీ–సర్వే ప్రక్రియ పూర్తయింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాలను మించి పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనకప్రసాద్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల తహసిల్దార్ ఆంజనేయ ప్రసాద్, ఆర్ఎస్‌డిటి, మండల సర్వేయర్, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ నోటీసుదారులతో కిక్కిరిసిన ఎంపీడీవో కార్యాలయం

**నార్పల ఆగస్టు 13 మనం న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియలో భాగంగా బిఎల్వోలు అందించిన నోటీసులు తీసుకొని ఓటర్లు స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి మరియు మండల తాసిల్దార్ కార్యాలయానికి భారీగా గురువారం చేరుకున్నారు. తాసిల్దార్ కార్యాలయం మరియు ఎంపీడీవో కార్యాలయం నోటీసుదారులతో కిక్కిరిసిపోయాయి. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల నోటీసుదారులు అసహనం తో పాటు ఆగ్రహానికి లోనయ్యారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళలు వృద్ధులు, ఇతర గ్రామాల నుండి వచ్చిన ప్రజలు అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పనులు వదులుకొని కార్యాలయానికి వచ్చి గంటలకు నిరీక్షించలేమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీగా చేరుకున్న ఓటర్లకు తోడుగా సర్వర్ సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఓటర్లు బిఎల్ఓ లపై తమ ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. అధికారులు ఓటర్ల సమస్య పరిష్కారానికి సరైన తీరు లేదని, శుక్రవారం నుంచి అయినా ఓటర్లకు మంచి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.





# మన ఇంటి పైన జాతీయ పతాకాన్ని ఎగరవేద్దాం




**–జయహో భారత్ ... వందేమాతరం.**

**–జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా**

**కుందుర్పి ఆగస్టు 13 మనం న్యూస్ :** మన మందరం కలసి మన ఇంటి పైన వాడ వాడలా జాతీయ పతాకాన్ని ఎగరవేద్దామని , ప్రిన్సిపాల్, అధ్యాపకులు , విద్యార్థులుకు , ప్రజలుకు పిలుపునిచ్చారు. గురువారం స్ధానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 9నుంచి 17వరకు 9రోజులు పాటు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంను విజయ వంతం చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్ధానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమంను చేపట్టి విద్యార్థులను ప్రజలను అవగాహన కలిగేలా చైతన్య పరిచారు. ఈ కార్యక్రమం తొలత కళాశాల నుంచి ప్రధాన వీదులు గుండా రామ స్వామి ఆలయం వరకు కొనసాగింది. వందే మాతరం,మనదే రాజ్యం, బారత్ మాతకే జై,భోళో స్వాతంత్ర్య భారత్ కి జై,,అని దేశభక్తిని చాటుకొనేలా పెద్ద పెట్టున దిక్కులు పేక్కటిల్లేలా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంను గ్రామ ప్రజలు ఆశక్తిగా తిలకించారు. అనంతరం ఆలయం వద్ద విద్యార్ధిని, విద్యార్థులు, అధ్యాపకులు ఇరువురు మానవ హారంగా ఏర్పడినారు. ఈ బారీ ర్యాలీ ప్రదర్శనలో విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని జాతీయ సేవా పథకం,బ్యానర్ ను చేతబూని ముందుకు కొనసాగింది.

శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కారించుకొని ప్రతి వాడవాడ ప్రతి ఇంటింట పైన త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి దేశం గర్వించదగ్గ రీతిలో తమ దేశభక్తిని ప్రతి పౌరుడు చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి కార్యకర్త శంకర పార్థివదేహానికి నివాళులు

**– మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి**

**గోరంట్ల, ఆగస్టు 13 మనం న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం హవేరి సమీపంలోని 48వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోరంట్ల మండలం జీనంవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోయ శంకర్ పార్థివదేహానికి వైసీపీ నాయకులు నివాళులర్పించారు. పెనుకొండ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు సోదరుడైన శంకర్ మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి శంకర్ స్వగృహానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పాల్గొన్న చరణ్ రెడ్డి.. శంకర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో



పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల వైసీపీ కన్వీనర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, బూతులు శ్రీనివాస్ రెడ్డి, నార్సింపల్లి హరినాథ్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.